E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 04-09-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



రెవెన్యూ శాఖకు 'సాదాబైనామా' సవాళ్లు » 2లో

## జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు » 4లో



## 7రోజుల్లో 7,000 జంప్ » 4లో



## 'హారర్ జోనర్ అంటే ఇష్టం.. ఏ డైరెక్టర్ ఇంతలా టార్చర్ చేయలేదు' » 5లో



# 5–18 శాతం పన్ను ఎత్తివేత

- గణనీయంగా తగ్గనున్న వాహన ధరలు
- రెండు శ్లాబుల విధానానికి ఏకగ్రీవ ఆమోదం
- ఈ నెల 22 నుంచి అమల్లోకి
- జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు
- వీటిపై ఉన్న 5–18 శాతం పన్ను ఎత్తివేత ఆరోగ్య, జీవిత బీమాపై పన్ను సున్నా
- సిగరెట్లు, గుట్కాలు, కూల్‌డ్రింక్స్ విలాస వస్తువులపై 40 శాతం
- ఎలక్ట్రిక్ వాహనాలపై 5శాతం పన్ను.. టూత్‌పేస్ట్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్‌పై 5 శాతం



న్యూఢిల్లీ,ఈకబురు: : సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల భారం దించుతూ జీఎస్టీ మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవంనాడు ప్రధాని ప్రకటించిన దీపావళి కానుక దసరాకు ముందే వచ్చింది. చపాతీ, పరోటా, బ్రెడ్డు, బన్నులపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అధ్యక్షతన భేటీ అయిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. అంతేకాదు కుటుంబాలకు ఆధారమైన ఆరోగ్య, జీవిత బీమాపై ప్రస్తుతమున్న 18 శాతం జీఎస్టీని ఎత్తివేయనుంది. దీంతో ఆ మేరకు వాటి ప్రీమియంలు తగ్గనున్నాయి. ఇకపై జీఎస్టీలో 5, 18 శాతం పన్ను శ్లాబులే ఉంటాయి. 12 శాతం, 28 శాతం శ్లాబుల్లోని వస్తువులు 5, 18 శాతం శ్లాబుల్లోకి మారనున్నాయి. బంగారం, వెండి, వజ్రాభరణాలపై ప్రత్యేక పన్ను రేటు 3 శాతం ఇక ముందూ కొనసాగనుంది.
ప్టెంబర్ 22 నుంచే (దేవీ నవరాత్రి వేడుకలు మొదలయ్యే రోజు) కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి.

కేంద్రం ప్రతిపాదనలకు అన్ని రాష్ట్రాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. "సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్కరణలు చేపట్టాం. సామాన్యులు రోజువారీ వినియోగించే అధిక శాతం వస్తువులపై పన్ను రేట్లు గణనీయంగా తగ్గనున్నాయి. కార్మికుల ఆధారిత రంగాలకు చక్కని మద్దతు లభిస్తుంది. రైతులు, వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం ప్రయోజనం పొందుతాయి. ఆర్థిక వ్యవస్థలోని కీలక చోదకాలకు ప్రాధాన్యం ఇచ్చాం"అని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యాపార నిర్వహణ సైతం సులభతరం అవుతుందని, నిబంధనల అమలు సరళంగా మారుతుందన్నారు. తాజా పన్ను శ్లాబుల క్రమబద్ధీకరణతో రూ.48,000 కోట్ల ఆదాయం తగ్గిపోనుందని, ద్రవ్యపరంగా దీన్ని ఎదుర్కోగలమని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ తెలిపారు.

తరువాయి 2లో

# రామన్నా.. నాన్నా.. జాగ్రత్త..!

- రామన్నా.. నాన్న ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడుకో
- కాళేశ్వరం డబ్బుతో 25 మంది ఎమ్మెల్యేలకు హరీశ్ ఫండింగ్
- సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించేందుకు రూ.60 లక్షలు పంపారు
- సంతోష్‌కి ధన దాహం.. అడవులను కొట్టేయాలని చూశారు
- మా కుటుంబం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం అన్న కుట్ర
- అందులో భాగంగానే మొదట నన్ను బయటకు పంపారు
- హరీశ్‌రావు వల్లే విజయశాంతి, ఈటల బీఆర్‌ఎస్‌ను వీడారు
- ఫోన్‌ట్యాపింగ్ చేసింది హరీశ్, సంతోష్, శ్రవణ్‌రావులే..



బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్, సంతోష్ అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటిందని చెప్పారు. కాళేశ్వరం అవినీతి డబ్బుతోనే హరీశ్‌రావు 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు సొమ్ములు ఇచ్చారని ఆరోపించారు.

తరువాయి 2లో

# రామన్న'.. మాట వెనుక మతలబేంటి!



- గతంలో కేటీఆర్‌పై పలు ఆరోపణలు
- ఇప్పుడు రామన్న అంటూ కవిత ప్రస్తావన
- నాన్న కేసీఆర్‌ను బాగా చూసుకోవాలంటూ జాగ్రత్తలు.. దీనిపై రాజకీయ వర్గాల్లో చర్చ
- రెండ్రోజుల్లో జిల్లాల వారీగా జాగృతి నేతలు, కార్యకర్తలతో భేటీలు
- కేసీఆర్ ఫొటోతో సొంత పార్టీ దిశగా కవిత పయనం!

తరువాయి 2లో

## ఐటీ రంగంపైనా.. ట్రంప్ సుంకాలు » 3లో

- ఐటీఈఎస్, రిమోట్ వర్క్‌పైనా..
- రెమిటెన్స్‌లపైనా భారీగా భారం
- ఆ మేరకు రీట్వీట్ చేసిన నవారో




## సామాన్యులకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగం బలోపేతం » 2లో



## ఆ చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా?



- హరీశ్, సంతోష్ వెనుక అని కొందరు.. కవిత వెనుక ఉన్నారని మరికొందరు..
- అలాంటి దిక్కుమాలిన ఆరోపణలు చేసే వారిని బండకేసి కొట్టాలి
- నేను ఎవరి వెనుకా ఉండను.. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ముందుంటా
- అవినీతి సొమ్మును ఎలా పంచుకోవాలో తెలియక ఆ కుటుంబంలో పంచాయితీ
- రాష్ట్రంలో మరే పార్టీ బతకవద్దనుకున్న బీఆర్‌ఎస్ కాలగర్భంలో కలిసిపోతోంది
- పాలమూరు పేదరికానికి ఎగ్జిబిషన్ కాదు
- అభివృద్ధి ప్రదర్శనకు వేదిక కావాలి: సీఎం
- భద్రాద్రి జిల్లా బెండాలపాడులో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు చేయించిన రేవంత్‌రెడ్డి

ఈకబురు: రాష్ట్రంలో వేరే పార్టీ ఉండకూడదని అనుకున్న వారే ఇప్పుడు తన్నుకొని చస్తున్నారని.. చేసిన పాపం ఊరికేపోదని పెద్దలు అన్నట్టే జరుగుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనుక ఉన్నానని కొందరు, కవిత వెనుక ఉన్నానని మరికొందరు ఆరోపణలు చేస్తున్నారని.. అలాంటి చెత్తగాళ్ల వెనుక తానెందుకు ఉంటానని పేర్కొన్నారు. ఇలాంటి దిక్కుమాలిన ఆరోపణలు చేసేవాళ్లను బండకేసి కొట్టాలన్నారు. అవినీతి సొమ్మును ఎలా పంచుకోవాలో తెలియక కల్వకుంట్ల కుటుంబంలో పంచాయతీలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని కార్నింగ్ టెక్నాలజీస్ కంపెనీలో నూతన యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బెండాలపాడులో ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమం, బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. "పదేళ్లు అధికారంలో ఉండి దోచుకున్న రూ.లక్షల కోట్ల సొమ్ము పంపకం కేసీఆర్ కుటుంబంలో చిచ్చు పెట్టింది. బావ, అన్న, చెల్లి కత్తులు, బల్లేలతో పొడుచుకుంటున్నారు. ఉరుమిరిమి మంగళం మీద పడ్డట్టు.. వాళ్లు కొట్టుకుని మా పేర్లు తీసుకొస్తున్నారు. 2023 డిసెంబరులోనే బీఆర్ఎస్ అనే కాలనాగును తెలంగాణ ప్రజలు కొట్టి చంపారు. ఆనాడే చచ్చిన దాన్ని మళ్లీ నేను చంపాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించారు.

నేను రాష్ట్ర అభివృద్ధిలో ముందుంటా..

తాను ఎవరి వెనుక ఉండనని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల ముందు ఉంటానని రేవంత్‌రెడ్డి చెప్పారు. కల్వకుంట్ల కుటుంబ పంచాయతీలోకి తమను లాగవద్దన్నారు.

తరువాయి 2లో

## ఆ అణు క్షిపణి పరిధి 20,000 కి.మీ.



- ఏకకాలంలో 10 ప్రాంతాలపై దాడిచేసే సత్తా
- ఆకట్టుకున్న డీఎఫ్5సీ
- భారీస్థాయిలో చైనా ఆయుధ ప్రదర్శన
- శాంతి, యుద్ధంలో ఏది కావాలో తేల్చుకోవాలి: జిన్‌పింగ్

తరువాయి 3లో




## పీసీ ఘోష్ కమిషన్ నివేదిక మీకు ఎక్కడిది?

- రిపోర్ట్‌ను కొట్టేయాలని పిటిషన్ వేసిన రిటైర్డ్ ఐఏఎస్ ఎస్కే జోషీకి హైకోర్టు ప్రశ్న
- కమిషన్ నివేదికను ఎక్కడా అప్‌లోడ్ చేయలేదు : ప్రభుత్వం

ఈ-కబురు: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక మీ చేతికి ఎలా వచ్చింది ? అంటూ నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషిని హైకోర్టు ప్రశ్నించింది. సాక్షిగా మాత్రమే పిలిచి, చట్టప్రకారం ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తనకు వ్యతిరేకంగా ఫైండింగ్స్ ఇవ్వడం చెల్లదని, ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయాలంటూ జోషి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్,

తరువాయి 3లో

## 6న గణేశ్ నిమజ్జనానికి అమిత్ షా » 3లో



## ఆ పంచాయితీల్లోకి మేము వెళ్లం

- కవిత చాలా చిన్న విషయాలే చెప్పారు
- ఎన్నో జీవోల గురించి చెప్పాలి: రఘునందన్‌రావు

తరువాయి 3లో



తరువాయి 2లో

ఈ-కబురు
04-09-2025
గురువారం
e-kaburu.com

# 5–18 శాతం పన్ను ఎత్తివేత

మొదటి పేజీ తరువాయి

కార్మికుల ఆధారిత రంగాలకు చక్కని మద్దతు లభిస్తుంది. రైతులు, వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం ప్రయోజనం పొందుతాయి. ఆర్థిక వ్యవస్థలోని కీలక చోదకాలకు ప్రాధాన్యం ఇచ్చాం''అని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యాపార నిర్వహణ సైతం సులభతరం అవుతుందని, నిబంధనల అమలు సరళంగా మారుతుందన్నారు. తాజా పన్ను శ్లాబుల క్రమబద్ధీకరణతో రూ.48,000 కోట్ల ఆదాయం తగ్గిపోనుందని, ద్రవ్యపరంగా దీన్ని ఎదుర్కోగలమని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ తెలిపారు.

ఈ నిర్ణయాలతో దేశీ వినియోగం మరింత పెరుగుతుందన్నది కేంద్ర ప్రభుత్వం అంచనా. మన జీడీపీలో 61.4 శాతం వినియోగం రూపంలోనే సమకూరుతుండడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చిన రెండో ఏడాదిలో జీడీపీ వృద్ధి 0.5 శాతం మేర అదనంగా నమోవుతుందని ఆర్థిక వేత్తల అంచనా. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లు దేశ ఆర్థిక వృద్ధిని 0.20-0.50 శాతం ప్రభావితం చేస్తాయన్న ఆందోళనలు నెలకొనగా.. జీఎస్టీ సంస్కరణలతో ఈ ప్రభావం సమసిపోనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**వీటి ధరలు దిగొస్తాయ్..**

ప్రస్తుతం బ్రాండెడ్ బ్రెడ్, బ్రెడ్ ఉత్పత్తులపై 5-18 శాతం మేర జీఎస్టీ అమల్లో ఉండగా ఇది తొలగిపోనుంది. పరాటాపై 18 శాతం, చపాతీ, యూహెచ్‌టీ పాలపై 5 శాతం రేటును ఎత్తివేయనున్నారు. నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, టూత్ బ్రష్‌లు, టాల్కమ్ పౌడర్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్, బటర్, నెయ్యి, మాంసం, బిస్కెట్లతో పాటు షుగర్ కన్ఫెక్షనరీ, జామ్, ఫ్రూట్ జెల్లీలు, డ్రై నట్స్, ఐస్‌క్రీమ్, పండ్ల రసాలు, కార్న్‌ఫ్లేక్స్ తదితర ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ 5 శాతానికి తగ్గిపోనుంది. ఇక వంటింటి వస్తువులు, గొడుగులు, సైకిళ్లు, వెదురు ఫర్నీచర్ వస్తువులు, ఫీడింగ్ బాటిళ్లు, టూత్ పౌడర్‌పై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి దిగిరానుంది. ఇంటి నిర్మాణంలోకి వినియోగించే సిమెంట్‌పైనా పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. 350 సీసీ ఇంజన్ సామర్థ్యం వరకు ఉన్న ద్విచక్ర మోటారు వాహనాలు, ఏసీలు, డిష్‌వాషర్లు, టీవీలు (32 అంగుళాలకు పైన) తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులపైనా ధరల భారం 28 శాతం నుంచి 18 శాతానికి దిగిరానుంది. ప1,200 సీసీ, 4,000 ఎంఎం పొడవు మించని పెట్రోల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ వాహనాలు, 1,500 సీసీ వరకు ఉన్న డీజిల్ వాహనాలపైనా పన్ను రేటు 18 శాతానికి తగ్గనుంది. 1,200 సీసీ నుంచి 4,000 ఎంఎం కంటే పొడవైన మోటారు వాహనాలు, 350సీసీకి పైన ద్విచక్ర వాహనాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు (వ్యక్తిగత వినియోగానికి), రేసింగ్‌కార్లు, క్యాసినోలు/గ్యాంబ్లింగ్/గుర్రపు పందేలు/లాటరీలపై 40 శాతం పన్ను రేటు అమలవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలపై ఎప్పటి మాదిరే 5 శాతం పన్ను కొనసాగనుంది.

**పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతానికి 28 శాతం**

సిగరెట్లు, గుట్కాలు, పాన్ మసాలా, జర్దా తదితర పొగాకు ఉత్పత్తులపైనా 40 శాతం పన్ను రేటును ప్రతిపాదించారు. అయినప్పటికీ ప్రస్తుతానికి వీటిపై 28 శాతం జీఎస్టీ, దీనిపై కాంపన్సేషన్ సెస్సును కొనసాగించనున్నారు. రాష్ట్రాలకు ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు తీసుకున్న రుణాలను తిరిగి పూర్తిగా చెల్లించేంత వరకు ఇది కొనసాగుతుందని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఆ తర్వాత వీటిపైనా 40 శాతం పన్ను రేటు అమలు కానుంది. ఇది ఎప్పటి నుంచి అన్నది జీఎస్టీ మండలి తర్వాత నిర్ణయిస్తుంది. పౌరుల జీవనం మెరుగుపడుతుంది కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పన్ను తగ్గింపులు, జీఎస్టీ సంస్కరణలకు జీఎస్టీ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు సామాన్యులకు, రైతులు, ఎంఎస్‌ఎంఈలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువతకు ప్రయోజనం కలిగిస్తాయి. ఈ విస్తృత స్థాయి సంస్కరణలు పౌరుల జీవనాన్ని మెరుగుపరుస్తాయి. వ్యాపార నిర్వహణ అన్నది, ముఖ్యంగా చిన్న వర్తకులు, వ్యాపారులకు సులభతరం అవుతుంది''

మొదటి పేజీ తరువాయి

# రెవెన్యూ శాఖకు 'సాదాబైనామా' సవాళ్లు



ఈకబురు: సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి హైకోర్టు పచ్చజెండా ఊపడంతో వీటికి మోక్షం లభించే అవకాశం ఏర్పడింది. అయితే ఈ దరఖాస్తులను పరిష్కరించడంలో రెవెన్యూ శాఖకు పలు సమస్యలు ఎదురయ్యేలా కనిపిస్తోంది. ఈ దరఖాస్తుల పరిష్కారానికి ప్రస్తుత నిబంధనల్లో మార్పు లు చేయడంతోపాటు మార్గదర్శకాల జారీలోనూ ప్రతి అంశానికి స్పష్టత ఇవ్వాల్సి ఉంటుందని భూ చట్టాల నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సాదాబైనామా సమస్యను పరిష్కరించేందుకు దోహదపడే మార్గదర్శకాలు, ఫార్మాట్లను రూపొందించే పనిలో అధికారులు తలమునకలై ఉన్నారు. 1989 నుంచి రెవెన్యూ శాఖ సాదాబైనామా సమస్యను పరిష్కరిస్తోంది. ఈ అనుభవంతో ఇప్పుడు ఎదురయ్యే సవాళ్లను ఏ విధంగా అధిగమిస్తుందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకుగాను తొలుత ప్రకటన విడుదల చేయాలి. దరఖాస్తుల పరిష్కారంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు గాను అవసరమైన ఫార్మాట్లను సిద్ధం చేయాలి. ఆ తర్వాత స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంటుంది.

**అసలు యజమానిఅఫిడవిట్ ఇవ్వాలి..**

సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా భూమి కొనుగోలు చేసిన వ్యక్తికి టైటిల్ నిర్ధారించడంతోపాటు భూమిపై ప్రభుత్వం రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తుంది. ఇందులో భాగంగా టైటిల్ వెరిఫికేషన్‌కు సివిల్ కోర్టు పరిశీలించినంత నిశితంగా సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సాదాబైనామాల పరిష్కారానికి ప్రస్తుత నిబంధనలతోపాటు అవసరమైన మార్పులు చేపడుతున్నారు. వీటిలో భూమి విక్రయించిన వ్యక్తి అఫిడవిట్ సమర్పించడం ఒకటిగా ఉంది. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తి తన ఆధీనంలో 12 ఏళ్లు భూమి ఉందంటూ ఆధారాలను చూపాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రస్తుతం అమల్లో ఉన్న స్టాంప్ డ్యూటీ ప్రకారం చలానా తీసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. 2014 వరకు మాన్యువల్‌గా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించేవారు. 2016లో ఈ ప్రక్రియను ఆన్‌లైన్ చేశారు. భూమికి సంబంధించిన ప్రతి దస్త్రాన్ని ఆన్‌లైన్‌లో పెట్టారు. రాష్ట్రం లో తాజాగా భూ భారతి చట్టం అమల్లోకి వచ్చినందున సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక మాడ్యుల్ అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇక సాంకేతికంగా తలెత్తే ఇబ్బందులను అధిగమిస్తూ.. న్యాయపరమైన చిక్కులకు తావులేకుండా సాదాబైనామా దరఖాస్తులపై రెవెన్యూ శాఖ ప్రత్యేక శ్రద్ధ పెడితే పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల దరఖాస్తుల్లో 30౹ దరఖాస్తులకు పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ చెబుతున్నారు. దీనికి కూడా కనీసం ఆరు నెలల సమయం పడుతుందన్నారు.

# ఆ చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా?

**నేను రాష్ట్ర అభివృద్ధిలో ముందుంటా..**

తాను ఎవరి వెనుక ఉండనని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల ముందు ఉంటానని రేవంత్‌రెడ్డి చెప్పారు. కల్వకుంట్ల కుటుంబ పంచాయతీలోకి తమను లాగవద్దన్నారు. బీఆర్ఎస్ కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు వంటిదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఏ పార్టీనీ బతకనీయకూడదనే ఉద్దేశంతో ఎంతో మంది నాయకులను జైలుకు పంపి ఇబ్బందులకు గురిచేశారన్నారు. ప్రకృతి చాలా గొప్పదని, ఎన్నో



పాపాలు చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోతోందని వ్యాఖ్యానించారు.పాలమూరును అభివృద్ధి వేదికగా మార్చుతాం..గతంలో పాలమూరు జిల్లా పేదరికాన్ని, కరువును ఇతర దేశాల వారికి ఒక ఎగ్జిబిషన్‌గా చూపించేవారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం వచ్చిందని, పాలమూరును అభివృద్ధి ప్రదర్శనకు వేదికగా మార్చుతామని ప్రకటించారు. దేవరకద్రలో ఒక డ్రైపోర్టు నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని, ఇప్పటికే బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూని ట్ ఏర్పాటు కోసం రక్షణ శాఖ పరిశీలన జరిపిందని తెలిపారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిని డిఫెన్స్ కనెక్టింగ్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టులకు గ్రీన్ చానల్ ద్వారా నిధులు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ , మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కామారెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటనఇటీవల అతిభారీ వర్షాలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారు. దెబ్బతిన్న పంటలు, రహదారులు, నీటమునగిన జనావాసాలను పరిశీలించి, వరద బాఽధితులను పరామర్శిస్తారు. సీఎం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరి తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ శివారులో ల్యాండ్ అవుతారు. రోడ్డు మార్గంలో ప్రయాణించి.. లింగంపేట మండలంలో కుర్దు వద్ద తెగిపోయిన ఆర్అండ్‌బీ బ్రిడ్జిని, బుడిగిద్ద గ్రామంలో దెబ్బతిన్న పంటలను, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వరద ప్రభావిత కాలనీలను పరిశీలిస్తారు. తర్వాత కామారెడ్డి కలెక్టరేట్ లో అధికారులతో సమీక్షిస్తారు. కాగా, భారీ వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన నష్టంపై అధికార యంత్రాంగం ఒక నివేదికను సిద్ధం చేసింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో రూ.210 కోట్లకుపైగా నష్టం జరిగిందని, అందులో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల కోసం రూ.38కోట్లు అవసరమవుతాయని గుర్తించింది. ఇక 334 గ్రామాల్లోని 49,984 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, సోయా, పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని.. 37,267 మంది రైతులకు నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

**సొంతింట్లోకి వెళ్లినట్టు ఉంది..: రేవంత్**

భద్రాద్రికొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గిరిజన గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గృహ ప్రవేశాలు చేయించారు. బచ్చల రమణ ఇంటిని సీఎం రేవంత్, బచ్చల నర్సమ్మ ఇంటిని పొంగులేటి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించారు. వారితో కలిసి గారెలు, పరమాన్నం స్వీకరించారు. బచ్చల నర్సమ్మను సీఎం కుశల ప్రశ్నలు అడిగి ఆమె ఒడిలో ఉన్న మనవరాలు పాన్యశ్రీ వెన్సికకు గారెలు తినిపించారు. రమణ కుమార్తె రాజేశ్వరిని పలకరించారు. 'అందరూ బాగున్నారా.. మంచిగా ఉన్నారా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మీ గ్రామంలో 312 ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డులు ఇచ్చాం.. మీరంతా సంతోషమే కదా' అని లబ్ధిదారులను అడిగారు. గ్రామంలో అందరూ పిల్లల్ని చదివించాలని, వారికి పెళ్లిళ్లు చేసిన అనంతరం వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామంలో బొడ్డురాయికి పూజ లు చేశారు. అనంతరం దామరచర్ల గ్రామంలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. పేదరికాన్ని తరిమికొట్టాలన్న లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టామని చెప్పారు. పేదలు గృహప్రవేశం చేస్తుంటే తన సొంత ఇంట్లో గృహప్రవేశం చేస్తున్నంత సంతోషంగా అనిపించిందని చెప్పారు.కేసీఆర్ దత్తత గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్లే: పొంగులేటికేసీఆర్ తన ఫామ్‌హౌజ్‌కు వెళ్లేందుకుదారి వెడల్పు చేసుకుని యాదాద్రి జిల్లా వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకున్నారని.. ఓ అవ్వ ఇంట్లో భోజనం చేసి, ఆమెతోపాటు గ్రామస్తులకు ఇల్లు కట్టిస్తానని మాటిచ్చి, తర్వాత పట్టించుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ఆ అవ్వతోపాటు వాసాలమర్రిలో 119 కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. తల తాకట్టు పెట్టయినా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామన్నారు. కాగా, కేసీఆర్ అరాచక పాలనను కూకటి వేళ్లతో పెకిలించి ఇందిరమ్మ రాజ్యం తెచ్చామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఇక సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అందరివాడు అని, ఆవేశమున్నా ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసినవారని కొనియాడారు.

మొదటి పేజీ తరువాయి

# ఆ పంచాయితీల్లోకి మేము వెళ్లం



హైదరాబాద్, ఈకబురు: కేసీఆర్ కుటుంబ, అవినీతి పంచాయితీల్లోకి తాము వెళ్లబోమని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. మోకిలా ప్రాజెక్టు తప్ప కవిత కొత్తగా చెప్పిన విషయం ఏమీ లేదని అన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత చాలా చిన్న విషయాలు మాత్రమే చెప్పారని, ఇంకా ఎన్నోజీవోల గురించి ఆమె చెప్పాల్సి ఉందన్నారు.

బీఆర్ఎస్ నేతల అవినీతి, కుటుంబ పాలన పట్ల వ్యతిరేకత వల్లే ప్రజలు దుబ్బాక ఉప ఎన్నికల్లో తనను గెలిపించారని అన్నారు. గత ఏడాది మార్చి 22న రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించడం ద్వారా తనను మెదక్‌లో ఓడించడానికి కుట్ర చేస్తున్నారని తాను అప్పట్లో చెప్పినట్లు వెల్లడించారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రెడ్డిల అవినీతిపైన ముఖ్యమంత్రి, ఏసీబీ స్పందించాలని, వారు చేసిన పాపపు పనులపై విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

# సామాన్యులకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగం బలోపేతం



**ఈ-కబురు.న్యూఢిల్లీ/ భారీ సంస్కరణలకు జీఎస్టీ మండలి ఆమోదం తెలపడంపై ప్రధాని మోదీ స్పందించారు. తాజా సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. వ్యాపారం మరింత సరళతరమవుతుందని, చిరు వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. సామాన్య ప్రజలకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టిందంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సామాన్యులు, మధ్యతరగతి వారు, రైతులు, మహిళలు, యువత, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వారికి ప్రయోజనం కలిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి నిర్ణయం తీసుకున్నాయని ఆయన చెప్పారు. జీఎస్టీలో భారీ సంస్కరణలు తీసుకురాబోతున్నట్లు ఎర్రకోట వేదికగా తాను స్వాతంత్ర్య దినోత్సవాన ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.**

మొదటి పేజీ తరువాయి

# రామన్నా.. నాన్నా.. జాగ్రత్త..!

హైదరాబాద్, ఈ కబురు : బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్, సంతోష్ అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటిందని చెప్పారు. కాళేశ్వరం అవినీతి డబ్బుతోనే హరీశ్‌రావు 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు సొమ్ములు ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను తన వెంట ఉంచుకొని పార్టీకి నష్టం చేయాలన్న కుట్రతోనే పార్టీ ఫండ్ కాకుండా ఆయన సొంత డబ్బులు ఇచ్చారన్నారు. ఆ ఎమ్మెల్యేల పేర్లూ తనకు తెలుసని, వారికి ఇబ్బంది కలిగించే ఉద్దేశం లేదు కాబట్టి వారెవరన్నది బయటపెట్టనని చెప్పారు. అలాగే సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించేందుకు హరీశ్ ఓ వ్యక్తికి రూ.60 లక్షలు ఇచ్చారని.. అతనే తనకీ విషయం చెప్పారని అన్నారు. అత్యధిక ధనదాహం ఉన్న సంతోష్‌రావు ఏకంగా అడవులను కొట్టేయాలని చూశారని.. ప్రభుత్వం హరితహారం చేపడితే, ఆయన గ్రీన్ చాలెంజ్ పేరుతో కోట్లు కొల్లగొట్టారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్‌రావు ఇళ్లల్లో బంగారం ఉంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. ''నాన్నా.. జాగ్రత్త. మన కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసి, బీఆర్ఎస్ పార్టీని ఆక్రమించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి'' అంటూ తండ్రి కేసీఆర్‌ను హెచ్చరించారు. బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్, సంతోష్‌ల అవినీతిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి, హరీశ్ ఒకే విమానంలో ప్రయాణం చేసిన విషయం నిజం కాదా..? అని కవిత ప్రశ్నించారు. ఆ రోజే వాళ్లిద్దరి మధ్య బంధం పెరిగిందని, తాను చెప్పేది తప్పయితే హరీశ్ స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌కు హరీశ్ సరెండరైన తర్వాతే తనపై కుట్రలు మొదలయ్యాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను కేసీఆర్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా లేఖను మండలి చైర్మన్‌కు పంపుతున్నట్లు కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు తాను, కేసీఆర్, కేటీఆర్ కలిసి ఉండకూడదని కుట్రలు చేశారని ఆరోపించారు.

తమ కుటుంబం విచ్ఛిన్నమైతే బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకోవాలని హరీశ్‌రావు, సంతోష్‌రావు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే మొదట తనను బయటకు పంపారని, రేపు రామన్నకూ ఇదే పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. ''ఆరడుగుల బుల్లెట్టు స్వార్థం వల్లే ఈ రోజు నాకు గాయమైంది. రేపు రామన్నకు, మరో రోజు నాన్నకూ ప్రమాదం తప్పదు'' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో మాట్లాడి రెండో అభ్యర్థిని పెట్టాలని హరీశ్‌రావు ప్రతిపాదించారని.. ఆ విషయం బీజేపీ ఎమ్మెల్యే ఒకరు తనకు చెబితే, కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానని కవిత వెల్లడించారు. ట్రబుల్స్ ఆయనే క్రియేట్ చేసి.. తర్వాత తానే పరిష్కరిస్తున్నట్లు నటించడం హరీశ్ నైజం అన్నారు. ''హరీశ్‌కు పాల వ్యాపారం ఉండేది. అధికారంలోకి రాగానే హాస్టళ్లకు పాలు సరఫరా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని రేవంత్‌రెడ్డి అంటారు. కానీ, ఆయనపై ఎటువంటి కేసులుండవు. అదే కేటీఆర్‌ను పనికిరాని కేసులు పెట్టి, పదేపదే విచారణకు పిలుస్తున్నారు. ఇప్పుడు కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌ను టార్గెట్ చేశారు. ఆయనపై సీబీఐ విచారణకు కారణం హరీశ్, సంతోష్‌లే. హరీశ్‌పై మొదటి రోజు ఆరోపణలు వస్తాయి. రెండో రోజు నుంచి ఆయన పేరు కనిపించదు. రేవంత్‌రెడ్డి గురించి హరీశ్ ఏనాడూ మాట్లాడలేదు. మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? హరీశ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేద ని రేవంత్‌ను నిలదీస్తున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. గతంలో పార్టీకి కొంచెం చెడ్డపేరు రాగానే హరీశ్ వెళ్లి వైఎస్‌ని కలవలేదా?'' అని కవిత ప్రశ్నించారు.

**హరీశ్‌ను నమ్ముకున్న ఎందరో బీఆర్ఎస్‌ను వీడారు**

హరీశ్‌రావును నమ్ముకున్న ఈటల రాజేందర్, జగ్గారెడ్డి, విజయశాంతి, విజయరామారావు.. ఇలా ఎందరో బీఆర్ఎస్ పార్టీని వీడారని కవిత చెప్పారు. ''కాళేశ్వరం నివేదికపై అర్ధరాత్రి దాకా అసెంబ్లీలో చర్చ జరిగింది. హరీశ్‌రావు బ్రహ్మాండంగా మాట్లాడారని పొగడ్తలు గుప్పిస్తున్నారు. కానీ, ఆ ఆరడుగుల బుల్లెట్టు నాకు గాయం చేసింది. ఆ తర్వాత మీవంతే రామన్నా. జాగ్రత్తగా ఉండండి'' అని కేటీఆర్‌కు సూచించారు.

**రామన్నా.. బుజ్జగించి అడుగుతున్నా..**

'నేను రామన్న (కేటీఆర్)ను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని అయిన నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేసి కనీసం అడగరా? నేను ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా? సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్నా. కేసీఆర్ ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడుకో. శరీరం బీఆర్ఎస్ అయితే.. జాగృతి ఆత్మ లాంటిది. తెలంగాణ సంస్కృతి, చరిత్రను కాపాడేందుకు కృషి చేశా. పార్టీ అభివృద్ధిలో నా పాత్ర లేదా? మేకవన్నె పులులను పార్టీలో ఉంచుకుంటే ఎలా ఉంటుందో బీఆర్ఎస్ పెద్దలు ఆలోచించాలి. నేను కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతా. వాళ్లు ఇంతకు అంత అనుభవించే రోజు వస్తుంది'' అని కవిత హెచ్చరించారు. కేసీఆర్‌పై ఒత్తిడి ఉండడం వల్లే తనను సస్పెండ్ చేయాల్సి వచ్చిందని భావిస్తున్నానని చెప్పారు. ఆయన ఎప్పుడూ ఆడబిడ్డల చెడు కోరుకోరన్నారు. కుటుంబంలో ఎన్నో అవమానాలు జరిగాయని, అవన్నీ బయటకు చెప్పుకోలేనని అన్నారు. అందుకే పార్టీ పరంగా ఉన్న సమస్యల గురించి మాత్రమే మాట్లాడానని, నిజాయితీని నిరూపించుకునేందుకే రాజీనామా చేశానని చెప్పారు. పార్టీ నుంచి బయటకు వెళ్తున్నందుకు బాధగా లేదన్నారు. రాజకీయంగా పొరపచ్చాలు ఇవ్వాళ ఉంటాయి, రేపు పోతాయని చెప్పారు. కానీ, తన తల్లికి దూరంగా ఉండాల్సి రావడమే బాధిస్తోందని కవిత ఉద్వేగానికి గురయ్యారు.

**సంతోష్‌రావుకు ధనదాహం ఎక్కువ..!**

''సంతోష్‌రావు.. చెప్పులో రాయి, చెవిలో జోరీగ లాంటోడు. అతనికి ధనదాహం ఎక్కువ. పెద్ద సార్ తెలంగాణ బాగు కోసం హరితహారం పేరిట మంచి కార్యక్రమం చేపడితే.. గ్రీన్ చాలెంజ్ అంటూ సంతోష్‌రావు నకిలీ ప్రోగ్రాం పెట్టి, సినీనటులతో ఫొటోలకు పోజులిప్పిస్తారు. దాని వెనక ఉన్న కుట్ర ఏంటంటే.. సంతోష్ కోసం వెంటనే ప్రభుత్వం నుంచి జీవో అమెండ్‌మెంట్ అవుతది. 10 శాతం ఆదాయం ఎవరైనా ఇస్తే.. అడవులను అమ్యూజ్‌మెంట్ పార్కులకు ఇస్తారు. చిరంజీవి, ప్రభాస్ వంటి సినిమా నటులను మోసం చేసి వాళ్లను తీసుకెళ్లి.. ఫొటోలకు పోజులిచ్చి, ఫారెస్టులను కొట్టేయాలని ఆయన ప్లాన్. ఈ సంతోషన్నకు ఇద్దరు ముగ్గురు మనుషులుంటారు. వాళ్లను సంప్రదించి.. అటవీ పరిరక్షణ పేరుతో వాళ్ల ఫొటోలు తీయించి, అడవులను కొట్టేయాలని చూశారు. రామన్న నియోజకవర్గం నేరెళ్లలో ఇసుక లారీ గుద్ది, దళిత బిడ్డ చనిపోతే నిరసన చేపట్టిన ఏడుగురు దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి విపరీతంగా కొట్టారు. పోలీసులకు ఫోన్ చేసి చెప్పి కొట్టించింది సంతోష్ అయితే, రాజకీయంగా బద్నామ్ అయింది మాత్రం రామన్న. ఇక పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన్ను ఇప్పుడు శ్రీమంతుడని అక్కడి ప్రజలు పిలుస్తున్నారు. నాకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పిన సమాచారం ప్రకారం.. ఓ కంపెనీతో కలిసి ఇదే పోచంపల్లి మోకిలలో రూ.750 కోట్లతో విల్లా ప్రాజెక్టులు చేస్తున్నారు. అవినీతి డబ్బులు కావా? ఆయనెవరు? సంతోష్‌రావు క్లాస్‌మేట్. ఆయనకు ఎమ్మెల్సీ పదవి వస్తుంది. కాంట్రాక్టులు వస్తాయి. అదేవిధంగా నవీన్‌రావు అనే ఎమ్మెల్సీ మాముందే 'నాకు ఎమ్మెల్సీ ఇచ్చింది కేసీఆరే అయినా. నా దేవుడు సంతోష్‌రావు' అని అంటారు. ఈయనపై భూకబ్జా కేసులుంటే అవి కూడా వదిలేశారు. నా దగ్గరున్న సమాచారాన్ని బయటపెడితే బీఆర్ఎస్ నేతలందరూ ఇబ్బంది పడాల్సి వస్తుంది. భవిష్యత్తుపై ఎలాంటి ప్రణాళికలు లేవు. ఏ పార్టీలో చేరను. ముఖ్యులతో సంప్రదించి త్వరలో నిర్ణయం ప్రకటిస్తా'' అని కవిత చెప్పారు.

**నాడు సమీక్షించుకుంటే..**

''ఓ వైపు సంతోష్‌రావు, హరీశ్‌రావు గ్యాంగ్.. కాంగ్రెస్ పార్టీతో, పైన ఉన్న బీజేపీతో సమన్వయం చేసుకుంటూ బీఆర్ఎస్‌ను జలగల్లాగా పట్టి పీడిస్తున్నారు. ఎంత దారుణానికి ఒడిగడుతున్నారంటే.. నా ఓటమితోనే అది ప్రారంభమైంది. నా ఓటమికి కుట్రలు చేస్తే సమీక్షించుకోలేదు. కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోవడంతో పాటు మూడోసారి అధికారం కోల్పోయే పరిస్థితికి చేరింది. గెలిచిన, ఓడిన వారందరినీ పిలిపించి మీరు మాట్లాడండి. సంతోష్‌రావు బాధితులు నాకు మామూలుగా ఫోన్లు చేయడం లేదు. బ్లూఫిన్ మోకిల.. ఇంత స్పష్టమైనవి నేను ఇస్తున్నా.. రేవంత్‌రెడ్డిని చాలెంజ్ చేస్తున్నా.. ఎందుకు మీ ఏసీబీ వాళ్లకు వీళ్ల ఇంటి అడ్రసలు దొరకడం లేదా? మీ మధ్య అండర్‌స్టాండింగ్ లేకపోతే మీరు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నా. నాకు 27 ఏళ్లు ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం కోసం వచ్చా. 20 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డా. ఇప్పుడు సస్పెండ్ చేస్తే చాలా బాధపడ్డా. సంతోష్ వల్లే మాకు సంబంధించిన టీవీ, పేపర్లలోనూ నా వార్తలు రావడం లేదు. సంతోష్, హరీశ్ గ్యాంగులు కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యాయి. వారిని పక్కన పెడితేనే పార్టీ బతుకుతుంది'' అని కవిత పేర్కొన్నారు.

**కేటీఆర్ సిబ్బంది ఫోన్లు కూడా..**

తన వద్ద పనిచేసే సిబ్బంది ఫోన్లను కూడా హరీశ్‌రావు, సంతోష్‌రావు, శ్రవణ్‌రావు ట్యాపింగ్ చేశారని కవిత ఆరోపించారు. అదే బ్యాచ్ కేటీఆర్‌కు సంబంధించిన వారి ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తమ కుటుంబంలోని నలుగురికి నోటీసులు వచ్చాయని.. హరీశ్, సంతోష్‌రావుకు మాత్రం రాలేదని చెప్పారు. కేసీఆర్‌కు తాను రాసిన లేఖను బహిర్గతం చేసింది కూడా సంతోష్‌రావే అని, ఓ టీవీ ఛానెల్‌కు, కాంగ్రెస్ నేతలకూ ఆయన లీక్ చేశారని తెలిపారు. ఈ గ్యాంగ్ గురించి కేసీఆర్‌కు గతంలో తాను స్వయంగా చెప్పానని.. బీఆర్ఎస్‌లో ఉండి ఇంతకాలం అంతర్గతంగా పోరాడానని, ఇప్పుడు బయటకు వచ్చి పోరాడతానని కవిత వెల్లడించారు.

**ఇవన్నీ.. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా?**

అక్రమ కేసుల్లో అరెస్టయి, తిహార్ జైల్లో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గత ఏడాది నవంబరు 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత చెప్పారు. గురుకులాల్లో జరుగుతున్న అక్రమాల గురించి మాట్లాడానని, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్టు కార్డు ఉద్యమం చేశామని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ స్వరూపాన్ని మార్చినప్పుడు గళమెత్తి నినదించామన్నారు. సీఎం సొంత జిల్లాలో భూ నిర్వాసితులకు అండగా ఉన్నామన్నారు. పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూడాలని తెలంగాణ భవన్ కార్యాలయ కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి ద్వారా ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ నాయకులకు సమాచారం ఇప్పించినట్లు ఆమె వెల్లడించారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పెద్దలు పునరాలోచించాలన్నారు.

**పనిగట్టుకొని తప్పుడు ప్రచారం**

పనిగట్టుకొని తనపై తప్పుడు ప్రచారం చేశారని.. తాజా పరిణామాలు తనను ఎంతో బాధ పెట్టాయని కవిత అన్నారు. ''ఎన్నో జన్మల పుణ్యముంటే కేసీఆర్‌కు కూతురిగా పుట్టా. కేసీఆర్‌ను, పార్టీని నేనెందుకు ఇబ్బంది పెట్టాలనుకుంటా? అధికారంలో ఉన్నప్పటికీ నన్ను ప్రతిపక్ష ఎంపీగానే చూశారు. పార్టీ భవిష్యత్తు గురించి, కుట్రదారుల వల్ల తనకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడా. కనీసం నా వివరణ కూడా తీసుకోకుండానే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వెనక కుట్రదారులు ఉన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీ అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాని ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెబితే దాన్ని కూడా వక్రీకరించి దుష్ప్రచారం చేశారు. కేసీఆర్ చిటికెన వేలు పట్టుకొని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయన చెప్పింది చెప్పినట్లు చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేను తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ బీఆర్ఎస్‌కు అవసరం లేదా?'' అని కవిత వ్యాఖ్యానించారు.

**రాజీనామా లేఖల అందజేత**

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ కల్వకుంట్ల కవిత రాసిన లేఖను జాగృతి నాయకులు బుధవారం చైర్మన్ కార్యాలయ ఓఎస్డీకి అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణభవన్ కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. కాగా, నిజం మాట్లాడినందుకు తనను పార్టీ నుంచి తొలగించారని.. ఇదే మూల్యం అయితే, తెలంగాణ ప్రజల కోసం వంద రెట్లు చెల్లించుకునేందుకు సిద్ధమని కవిత ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. జై తెలంగాణ' అని పేర్కొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# 6న గణేశ్ నిమజ్జనానికి అమిత్



ఈకబురు.ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) నిర్వాహకులు పంపించిన ఆహ్వానంపై అమిత్ షా కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం సానుకూల స్పందన వచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దీని ప్రకారం అమిత్ షా శనివారం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.

మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఆయన బసచేస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్యలో రాష్ట్ర బీజేపీ నేతలతో అమిత్‌షా ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆ తర్వాత 3 గంటల నుంచి 4 గంటల వరకు బీజీయూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభిస్తారు.

ఈ పర్యటనలో భాగంగానే.. ఐటీసీ కాకతీయ హోటల్ నుంచే ఎస్ఎస్‌బీ బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌కు అమిత్ షా వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 4:10 నుంచి 4:55 వరకు మొజంజాహీ మార్కెట్ వద్ద గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5:05 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి అమిత్ షా తిరుగు ప్రయాణమవుతారు.

గతంలో పాల్గొన్న ప్రముఖులు..

గతంలో హైదరాబాద్‌లో జరిగిన వినాయక నిమజ్జన ఉత్సవాల్లో .. ఉమ్మడి ఏపీ సీఎం డా.మర్రిచెన్నారెడ్డి మొదలు, అస్సాం సీఎం హిమంతబిశ్వశర్మ, కేంద్ర మాజీ మంత్రులు ఉమాభారతి, సాధ్వి రీతంబర, ఆరెస్సెస్ ప్రస్తుత సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, పూర్వ సర్ సంఘ్‌చాలక్‌లు బాలసాహెబ్ దేవరస్, ప్రొ.రాజేందర్‌సింగ్ (రజ్జూ భయ్యా), కేఎస్ సుదర్శన్, వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారని సాక్షికి బీజీయూఎస్ ప్రధానకార్యదర్శి డా. రావినూతల శశిధర్ తెలిపారు.

# కవిత.. కేసీఆర్ విడిచిన బాణం



హైదరాబాద్, ఈకబురు: కవిత.. కేసీఆర్ విడిచిన బాణమేనని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకు కేసీఆర్ కుటుంబం ఆడుతున్న కొత్త నాటకమిదన్నారు. కవిత అమెరికా వెళ్లి తిరిగి రాగానే తన స్టాండ్‌ను ఎందుకు మార్చారని.. అంతకుముందు కేటీఆర్‌పైకి ఎక్కుపెట్టిన బాణం.. హరీశ్‌రావుపైకి ఎందుకు మళ్లిందని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి కవిత రాజీనామా చేయడం శుభ పరిణామమని, అయితే ఆమె ఐదేళ్ల ముందే ఈ రాజీనామా చేసుంటే ప్రజలు అంగీకరించి ఉండేవారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్ణయాలు చేసేవారిలో కవిత కూడా ఒకరని, ఆమె భాగస్వామ్యం లేకుండానే అవినీతి జరిగిందా అని ప్రశ్నించారు. వాటాల పంపకాల్లో తేడాల వల్లే కవిత కొట్లాడుతోందని ఆరోపించారు. హరీశ్‌రావు, సంతోష్‌రావుల వెనక ఉండాల్సిన ఖర్మ తమకు లేదని, తాము ప్రజల వెంట ఉంటామని పేర్కొన్నారు.

# మోదీ దార్శనికతతో జాతీయ రహదారుల అభివృద్ధి



ఈకబురు:దరాబాద్: ప్రధాని మోదీ దార్శనికతతో 2014 నుంచి తెలంగాణ జాతీయ రహదారులు అద్భుతమైన ప్రగతిని సాధించాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో బుధవారం ఆయన పోస్టు చేశారు. '2,722 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. ఎన్‌హెచ్ రోడ్లుగా 2,526 కి.మీ. రాష్ట్ర రహదారుల ఉన్నతీకరణ చేపట్టాం. రూ.38,297 కోట్లతో 1,719 కి.మీ. ఎన్‌హెచ్ కారిడార్లకు అనుమతులు ఇచ్చాం. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద 12 వేల కి.మీ. రోడ్లను నిర్మించాం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఐటీ రంగంపైనా..ట్రంప్ సుంకాలు



ఈకబురు.న్యూఢిల్లీ/వాషింగ్టన్, సెప్టెంబరు 3: అమెరికాకు భారత్ ఎగుమతి చేసే ఉత్పత్తుల పై 50శాతం సుంకాలను ప్రకటించిన ట్రంప్ సర్కారు దృష్టి ఇప్పుడు సమాచార సాంకేతిక(ఐటీ) రంగం, ఐటీఈఎస్, రిమోట్ వర్కర్లు, ప్రవాస భారతీయులు పంపే రెమిటెన్స్‌పై పడిందా? ఆయా సేవలపైనా సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నారా? దీని వల్ల భారత దేశీయోత్పత్తి(జీడీపీ)లో అత్యంత కీలకమైన ఐటీ, సేవా రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందా? ఈ ప్రశ్నలకు తాజా పరిస్థితులు అవుననే చెబుతున్నాయి. అమెరికా కన్జర్వేటివ్ పార్టీ ప్రతినిధి జాక్ పోసోబిక్ ఎక్స్‌లో చేసిన ఓ పోస్టును వైట్ హౌస్‌లో శక్తిమంతమైన అధికారిగా ఉన్న వాణిజ్య, ఉత్పాదక విభాగాల సీనియర్ సలహాదారు పీటర్ నవారో రీట్వీట్ చేయడం ఈ వాదనలకు బలాన్ని చేకూరుస్తోంది. "అన్ని ఔట్‌సోర్సింగ్‌లపై సుంకం విధించాలి. విదేశాల నుంచి అమెరికాలోని కంపెనీలకు రిమోట్ సర్వీసుల(ఉద్యోగులు) పైనా ప్రివిలేజ్ కోసం సుంకాలు వేయాలి'' అని పోసోబిక్ ట్వీట్ చేశారు. దాని నవారో వెంటనే రీట్వీట్ చేయడం గమనార్హం..! ఇది కార్యరూపం దాలిస్తే ఐటీతోపాటు.. ఐటీ ఆధారిత సేవారంగం(ఐటీఈఎస్), బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్(బీపీవో) ద్వారా విదేశాల నుంచి రిమోట్‌గా పనిచేసే వర్కర్లు/ఉద్యోగులు, అమెరికాలోని భారతీయ ఐటీ కంపెనీల్లో పనిచేసే హెచ్1బీ వీసాదారులు, భారత్‌కు రెమిటెన్స్ పంపే ప్రవాస భారతీయులపై తీవ్ర ప్రభావం పడుతుంది.

పుతిన్, జిన్‌పింగ్, కిమ్‌లపై ట్రంప్ ఫైర్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నియంత కిమ్‌జోంగ్ ఉన్‌లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ ముగ్గురు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. చైనా మిలిటరీ పరేడ్‌లో జిన్‌పింగ్‌తో కలిసి కిమ్, పుతిన్, పాల్గొనడంపై ట్రంప్ నిప్పులు కురిపించారు. "రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికా సైనికుల త్యాగాలను జిన్‌పింగ్ గుర్తిస్తారా? లేదా? వారి త్యాగాన్ని జిన్‌పింగ్ గౌరవిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు

# రామన్న'.. మాట వెనుక మతలబేంటి!



హైదరాబాద్, ఈకబురు: గతంలో కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ కవిత అన్నారు. అప్పుడు ఆ వాఖ్య సంచలనంగా మారింది. ఆ దయ్యాల్లో కేటీఆర్ కూడా ఉన్నారని కొన్ని పత్రికలు రాశాయి. సోషల్ మీడియాలోనూ వార్తలు వచ్చాయి. టీవీ చానళ్లల్లోనూ చర్చ జరిగింది. అయితే ఆ రాతలను, చర్చలను ఎప్పుడూ, ఎక్కడా కవిత ఖండించలేదు. కేటీఆర్‌ను ఉద్దేశించి ఆరోపణలూ చేశారు. బీఆర్ఎస్ నుంచి తన సస్పెన్షన్ జరిగిన తరువాత బుధవారం విలేకరుల సమావేశంలో మాత్రం కేటీఆర్‌ను 'రామన్న' అంటూ కవిత సంబోధించారు. హరీశ్, సంతోష్‌రావులపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆమె కేటీఆర్‌పై ఎలాంటి ఆరోపణలు చే యకపోవడం గమనార్హం. తండ్రి కేసీఆర్‌ను బాగా చూసుకోవాలంటూ జాగ్రత్తలు చెప్పారు. కవిత చేసిన ఈ వాఖ్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే అన్ని విషయాలను ఇప్పుడే బయటపెట్టేస్తే ఇంతటితో చల్లారిపోతుందని అనుకున్నారా? లేదంటే కవిత మాటల వెనుక ఇంకా పెద్ద మతలబు ఏమైనా ఉందా? అన్నదానిపై చర్చ నడుస్తోంది.

కాగా సొంత పార్టీ ఏర్పాటు దిశగా కవిత ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. సొంత పార్టీ పెట్టినా తన తండ్రి కేసీఆర్ ఫొటోను మాత్రం పార్టీ కార్యకలాపాల్లో వాడనున్నారని తెలుస్తోంది. రెండ్రోజుల తరువాత జాగృతి నాయకులు, కార్యకర్తలతో కవిత జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే బహుజన నాయకులు, మేధావులతోనూ మాట్లాడనున్నారు. సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాల మేరకు పార్టీ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. 'సామాజిక తెలంగాణ' నినాదంతో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ప్రధానంగా గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో విస్మరణకు గురయ్యా మని బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను భాగస్వామ్యం చేయాలని కవిత నిర్ణయించుకున్నట్టు సమాచారం.

# పీసీ ఘోష్ కమిషన్ నివేదిక మీకు ఎక్కడిది?



ఈకబురు: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక మీ చేతికి ఎలా వచ్చింది ? అంటూ నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషిని హైకోర్టు ప్రశ్నించింది. సాక్షిగా మాత్రమే పిలిచి, చట్టప్రకారం ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తనకు వ్యతిరేకంగా ఫైండింగ్స్ ఇవ్వడం చెల్లదని, ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయాలంటూ జోషి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారించింది. కమిషన్ నివేదిక ఆధారంగా తనపై చర్యలు తీసుకోకుండా స్టే విధించాలని ఎస్కే జోషీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ధర్మాసనం.. అసలు కమిషన్ నివేదిక మీ చేతికి ఎలా వచ్చిందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ న్యాయవాది బదులిస్తూ.. పబ్లిక్ డొమైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు మంత్రులు నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో రిపోర్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ విడుదల చేశారని పేర్కొన్నారు.

నివేదికను అసెంబ్లీలో కూడా ప్రవేశపెట్టారని.. ఈ నేపథ్యంలోనే డౌన్‌లోడ్ చేసుకున్నామని చెప్పారు. అసెంబ్లీలో ప్రవేశపెడితే కేవలం ఎమ్మెల్యేల వద్దే ఉంటుందని.. అది బయటకు ఎలావచ్చింది? అని ధర్మాసనం ప్రశ్నించింది. "ప్రభుత్వ వెబ్‌సైట్లు, పబ్లిక్ డొమైన్‌లో నివేదిక సారాంశం ఉంటే తొలగించాలని ఇప్పటికే ఆదేశించామని, అయినా మీరెలా డౌన్‌లోడ్ చేసుకున్నారు? నివేదిక ఎక్కడి నుంచి వచ్చిందో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయండి'' అని పిటిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. మరోవైపు, ఘోష్ కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని, కావాలంటే లిఖిత పూర్వక వివరణ ఇస్తామని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ ప్రభావితవ్యక్తి అవునా? కాదా? ముందు తెలియాలని వ్యాఖ్యానించింది. సరైన విధానంలో కమిషన్ రిపోర్ట్ అందకుండా పిటిషనర్ బాధిత వ్యక్తి అని ఎలా తేలుస్తామని ప్రశ్నించింది. కమిషన్ నివేదికను ఎక్కడ అప్‌లోడ్ చేశారో తెలపండని ప్రభుత్వాన్ని ఆదేశించి విచారణను 10కి వాయిదా వేసింది.

# ఆ అణు క్షిపణి పరిధి 20,000 కి.మీ.



ఈ-కబురు: బీజింగ్: అదో అరివీర భయంకర అణు క్షిపణి. పేరు డీఎఫ్-5సీ. అణ్వాయుధాలతో అత్యంత కచ్చితంగా లక్ష్యాన్ని కొట్టేస్తుంది. పరిధి ఏకంగా 20,000 కిలోమీటర్లు. అంటే ప్రపంచంలో ఏ దేశం మీద దాడికైనా ప్రయోగించవచ్చు. ఏకకాలంలో 10 ప్రాంతాలపై గురిపెట్టి విధ్వంసం సృష్టించగల సత్తా దీనికి ఉంది. అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించుకొని వెళ్లగలదు. ఇక ఎల్‌వై-1 లేజర్ ఆయుధం.. ఎనిమిది చక్రాల హెచ్‌జడ్-155 సైనిక ట్రక్కుపై బిగించి ఉంటుంది. శత్రుదేశాల ఆయుధాల ఆప్టికల్ సెన్సర్లు, పరికరాలను సమర్థంగా ధ్వంసం చేయగలగడం దీని ప్రత్యేకత. మల్టిపుల్ రాకెట్ లాంచర్లు, గగనతలం నుంచే ప్రయోగించే వీలున్న జేఎల్-1 అణ్వాయుధ క్షిపణి.. ఇలా ఒకటారెండా..! యుద్ధం వస్తే కనీవినీ ఎరగని బీభత్సాన్ని సృష్టించగల ఆయుధాలెన్నో చైనా అమ్ములపొదిలో ఉన్నాయి. ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌యే) బుధవారం బీజింగ్‌లో తియానన్మేన్ స్క్వేర్ వద్ద వీటిని ప్రదర్శించింది. హైపర్‌సోనిక్, లేజర్ వంటి కొన్ని ఆయుధాలనైతే తొలిసారిగా బయటపెట్టింది. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ సహా 26 దేశాల నేతలు, సైనికాధికారులు ఈ ప్రదర్శనను తిలకించారు. అమెరికాకు వ్యతిరేకంగా ఐక్యతను చాటుకునేందుకు జిన్‌పింగ్, పుతిన్, కిమ్ ఒకే వేదికపైకి రావడం విశేషం. అమెరికా, జపాన్, భారత్ వంటివి ఈ వేడుకకు హాజరుకాలేదు.

ప్రస్తుతం ప్రపంచం ముందు రెండు ఐచ్ఛికాలే ఉన్నాయని జిన్‌పింగ్ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. "శాంతియుత అభివృద్ధి మార్గాన్ని చైనా అనుసరిస్తుంది. మా అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి సిద్ధంగా ఉన్నాం. శాంతి-యుద్ధం, సంభాషణ-ఘర్షణ, పరస్పర విజయం-నష్టాలు.. ఇలాంటి వాటిల్లో ఒక్కదాన్నే ఎంచుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. శాంతి, అభివృద్ధివైపే చైనా ప్రజలు నిలుస్తారు. ప్రపంచ దేశాలు సమాన హక్కులతో, శాంతియుతంగా జీవించి పరస్పర సహకారంతో ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు. ప్రపంచశ్రేణి బలంగా చైనా సైన్యం మారాలన్నారు. అతిథులకు జిన్‌పింగ్, ఆయన సతీమణి పెంగ్ లుయాన్ స్వాగతం పలికారు.

తియానన్మేన్ స్క్వేర్ వద్ద నిర్వహించిన ప్రదర్శన ద్వారా తన సైనికశక్తిని, జిన్‌పింగ్ నాయకత్వ పటిమను ప్రపంచానికి చాటేందుకు చైనా ప్రయత్నించింది. చైనా, రష్యా, ఉత్తర కొరియా అధినేతలు తొలిసారి ఒకే వేదికపై ఆసీనులై తమ ఐక్యతను చాటారు. దేశ సైనిక సామర్థ్యాలను మరింత పెంచుతామని చైనా అధ్యక్షుడు చెప్పారు.

కిమ్‌తోపాటు ఆయన 13 ఏళ్ల కుమార్తె కిమ్-జు-యే కనిపించారు. ఆమె విదేశీ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. భవిష్యత్తులో పాలనా పగ్గాలు ఆమె అందుకోనున్నారనే వార్తలకు ఇది సంకేతమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఉక్రెయిన్ ఆక్రమించుకొన్న కర్స్క్ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు ఉత్తరకొరియా చేసిన సాయానికి గానూ కిమ్‌కు పుతిన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రదర్శన తర్వాత కిమ్, పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇద్దరూ కలిసి ఒకే కారులో ఆ వేదిక వరకు ప్రయాణించారు. రష్యాలో మరోసారి పర్యటనకు రావాల్సిందిగా కిమ్‌ను పుతిన్ ఆహ్వానించారు.అందరి దృష్టినీ ఆకట్టుకున్న ద్రవ ఇంధన డీఎఫ్-5సీ ఖండాంతర క్షిపణిని ఒక్క వాహనంపై తీసుకెళ్లడం సాధ్యం కాదు. అందుకే దీనిని మూడు భాగాలుగా విడదీసి తరలించి, తర్వాత అన్నింటినీ జతచేస్తారు. దీనిని నేలమాళిగ నుంచి కూడా ప్రయోగించవచ్చు. ఇది భూగర్భ స్థావరాలను కూడా ఛేదించగలదు. దాడి సమయంలో ధ్వని కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగలదు. దీనిని ఎదుర్కోవడానికి ప్రస్తుత గగనతల రక్షణ వ్యవస్థలకు అతి తక్కువ సమయం మాత్రమే లభిస్తుంది. ఒకేసారి పలు అణు, సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకువెళ్తుంది.అత్యంత కచ్చితత్వంతో దాడిచేసే సామర్థ్యం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులకు ఉండదు. డీఎఫ్-5సీలో మాత్రం బైడూ నేవిగేషన్ వ్యవస్థ సహా ఇతర టెక్నాలజీని వాడడం వల్ల 20,000 కిలోమీటర్లు ప్రయాణించినా..

టైప్-100 యుద్ధ ట్యాంకులు, డాంగ్‌ఫెంగ్-61 ఖండాంతర క్షిపణి (రేంజి 12,000 కిలోమీటర్లు), ఏజేఎక్స్002 భారీ సముద్ర డ్రోన్, కృత్రిమ మేధతో దాడిచేసే డ్రోన్లు, సరికొత్త డీఎఫ్-26డీ మధ్యశ్రేణి రేంజి బాలిస్టిక్ క్షిపణి, జీజే-11 లాయల్ వింగ్‌మన్, సీజే-1000 హైపర్ సోనిక్ క్షిపణి, హెచ్‌క్యూ-20 గగనతల రక్షణ వ్యవస్థ వంటివెన్నో ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి

# స్-400ల కొనుగోలుకురష్యాతో భారత్ చర్చలు



ఈకబురు: : గగనతలాన్ని మరింత దుర్భేద్యం చేసే లక్ష్యంతో మనదేశం అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు దడ పుట్టించిన ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థలను రష్యా నుంచి మరిన్ని కొనడానికి సిద్ధమైంది. ఈ కొనుగోళ్ల విషయంలో చర్చలు జరుగుతున్నాయని రష్యా మిలిటరీటెక్నికల్ కోఆపరేషన్ అధిపతి దిమిత్రీ షుగయేవ్ ధ్రువీకరించారు. టాస్ మీడియాతో ఆయన మాట్లాడుతూ "ఇప్పటికే భారత్ వద్ద ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఈ విషయంలో సహకారాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది. అంటే మరిన్ని సరఫరా చేస్తాం. ప్రస్తుతానికి చర్చల దశలో ఉన్నాం'' అని పేర్కొన్నారు. చైనాలో ఎస్‌సీఓ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, పాక్, చైనాల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కోవడానికి 2018లోనే మన దేశం ఎస్400 వ్యవస్థలను కోనుగోలు చేసింది. 5యూనిట్ల కోసం రూ.39 వేల కోట్లతో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే వాటి సరఫరా పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. 202123 మధ్య మూడు యూనిట్లు మన దేశానికి చేరాయి. వీటిని అదంపూర్ (పంజాబ్), తూర్పు సెక్టార్, పశ్చిమ సెక్టార్‌లో మోహరించారు. మరో రెండు రావాల్సి ఉంది. ఆ రెండింటిలో ఒకటి వచ్చే ఏడాది, మరోటి 2027లోనూ భారత్‌కు రష్యా అప్పగిస్తుందని అంచనా వేస్తున్నారు.

# జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు



**ఢిల్లీ: ప్రజలకు కేంద్ర ప్రభుత్వం పండగ బొనాంజా ప్రకటించింది. జీఎస్టీ రేట్లు తగ్గింపునకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 12, 28 శాతం శ్లాబులు రద్దు చేయాలని నిర్ణయించింది. 5, 18 శ్లాబులను మాత్రమే కేంద్రం కొనసాగించనుంది. ఈనెల 22 నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులు అమలు కానున్నాయి. లగ్జరీ వస్తువులపై 40 శాతం పన్ను విధించింది. హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీ రద్దు చేసింది.**

సామాన్యులపై ఆర్థిక భారం పడకుండా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇకపై రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయని ఆమె పేర్కొన్నారు. లైఫ్ సేవింగ్ డ్రగ్స్, మెడిసిన్స్‌పై 12 శాతం జీఎస్టీ తొలగించగా.. సిమెంట్ పై టాక్స్ 28 నుంచి 18 శాతానికి కుదించాం. క్యాన్సర్ మందులపై జీఎస్టీ తొలగించినట్లు నిర్మల పేర్కొన్నారు.

సామాన్యులు వాడే వస్తువులపై జీఎస్టీ తగ్గించామని, రైతులు, సామాన్యులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. వ్యవసాయ, వైద్య రంగాలకు ఊరట కలిగించే నిర్ణయాలకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

''ఈజ్ ఆఫ్ లివింగ్ కోసమే న్యూ జనరేషన్ రిఫార్మ్స్. ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలకు పిలుపునిచ్చారు. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకొని సంస్కరణలు తెచ్చాం. కొత్త సంస్కరణలకు జీఎస్టీ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కామన్ మ్యాన్, మిడిల్ క్లాస్ ఉపయోగించే వస్తువులన్నీ ఐదు శాతం పన్ను పరిధిలోకి తెచ్చాం. పాలు, రోటి, బ్రెడ్‌పై ఎలాంటి పన్ను లేదు. ఏసీ, టీవీ, డిష్‌వాషర్లు, చిన్నకారులపై పన్నును 28 నుంచి 18 శాతానికి తగ్గించాం'' అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

**అన్ని టీవీలపై 18 శాతం జీఎస్టీ**
**వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింపు**
**చాలా ఎరువులపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గింపు**
**చేనేత, మార్బుల్, గ్రానైట్‌పై 5 శాతం జీఎస్టీ**
**33 ఔషధాలపై జీఎస్టీ 12 నుంచి సున్నాకి తగ్గింపు**
**350 సీసీ కంటే తక్కువ వాహనాలపై 18 శాతం జీఎస్టీ**
**350 సీసీ దాటిన వాహనాలపై 40 శాతం పన్ను**
**కార్బొనేటెడ్ కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లపై 40 శాతం జీఎస్టీ**
**పాన్ మసాలా, సిగరెట్, గుట్కా, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ**

# 7రోజుల్లో 7,000 జంప్

**న్యూఢిల్లీ: పుత్తడి నాన్‌స్టాప్‌గా పరుగులు తీస్తోంది. గడిచిన ఏడు రోజుల్లో 10 గ్రాములకు దేశీయంగా రూ.7,000 లాభపడింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070 వద్ద ముగిసింది. పసిడికి దేశీయంగా ఇది నూతన జీవిత కాల గరిష్ట స్థాయి. ఈ నెల 25న పసిడి ధర రూ.1,00,170 వద్ద ఉండడం గమనార్హం. ఇక 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.1,000 పెరిగి రూ.1,06,200 స్థాయిని తాకింది.**





మరోవైపు వెండి ధర పెద్దగా మార్పు లేకుండా రూ.1,26,100 స్థాయిలో ట్రేడయ్యింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ పసిడి 21 డాలర్లకు పైనే పెరిగి సరికొత్త గరిష్ట స్థాయి అయిన 3,618.50 డాలర్లకు చేరుకుంది. ''యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు పెరిగాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండడం, అమెరికా ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలు బంగారం ధరల ర్యాలీకి మద్దతునిచ్చాయి.
ఈ వారం చివర్లో ఓపెక్ ప్లస్ కూటమి సమావేశం జరగనుంది. ఇటీవలి ఉక్రెయిన్ దాడితో రష్యా ఆయిల్ ప్రాసెసింగ్ సామర్థ్యం 17 శాతం ప్రభావితం కావడంతో సరఫరా పరమైన ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఇటీవలి కనిష్టాల నుంచి చమురు ధరలు సైతం పుంజుకున్నాయి''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా వివరించారు. ఫెడ్ రేటు కోతల అంచనాలకు తోడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న టారిఫ్ విధానాలు పసిడి ధరలను నడిపిస్తున్నట్టు వెంచురా కమోడిటీ హెడ్ ఎన్ఎస్ రామస్వామి సైతం అభిప్రాయపడ్డారు.



# హైదరాబాద్‌లో యాపిల్ విస్తరణ... మరింత స్థలం లీజు

ప్రముఖ గ్లోబల్ సంస్థ యాపిల్ హైదరాబాద్ నగరంలో తన ఉనికిని, సేవలను మరింత విస్తరించింది. ఇందులో భాగంగా నగరంలోని ఐటీ పార్క్ వేవ్‌రాక్‌లో నూతనంగా 64,125 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఈ విస్తరణతో సంస్థ మొత్తంగా 5 లక్షల చదరపు అడుగులకు చేరుకుంది.

అయితే వేవ్‌రాక్ టవర్‌లో యాపిల్ 64,125 చదరపు అడుగుల అదనపు కార్యాలయ స్థలానికి రూ.80.15 లక్షల నెలవారీ అద్దె చెల్లించేలా ఐదేళ్లకు లీజ్‌కు తీసుకున్నట్లు సమాచారం. ఇందుకుగాను చదరపు అడుగుకు రూ.125 చొప్పున చెల్లించనుంది. హైదరాబాద్‌లోని టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ లిమిటెడ్ ద్వారా ప్రాజెక్ట్‌లో ఉన్న యాపిల్ ప్రస్తుత కార్యాలయాలను విస్తరించింది. ప్రాప్‌స్టాక్ ప్రకారం., యాపిల్ కంపెనీ ఈ ప్రాజెక్ట్‌లో అనేక కార్యాలయ స్థలాలను మల్టీ లీజ్‌లో భాగంగా మొత్తం 5 లక్షల చదరపు అడుగుల తీసుకుంది.


అద్దె ప్రారంభ తేదీ నుండి లీజుకు మూడు సంవత్సరాల లాక్‌ఇన్ వ్యవధి ఉంటుంది . ఈ సమయంలో, ఒప్పందంలో పేర్కొన్న నిర్దిష్ట షరతుల కింద తప్ప, ఏ పక్షమూ లీజును రద్దు చేయలేరు. 2016 మేలో యాపిల్ సీఈవో టిమ్ కుక్ అధికారికంగా హైదరాబాద్ కార్యాలయాన్ని ప్రారంభించారు. జియోస్పేషియల్ టెక్నాలజీ, డేటా మోడలింగ్‌లో ప్రత్యేకత కలిగిన యాపిల్ మ్యాప్స్‌కు ఇది కీలకమైన అభివృద్ధి కేంద్రంగా పనిచేస్తుంది.

# ఏఐ.. ఓ కొత్త అవకాశం


**ఉద్యోగాలు పెరుగుతాయ్**
**పీయూష్ గోయల్**

**ఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఏఐ దేశానికి ఓ కొత్త అవకాశమని, ఇది భారీ సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ, ఏఐని సమర్థంగా ఉపయోగించాలని సూచించారు. 'నా కార్యాలయంలో నిర్ణయాత్మక స్థాయిలో ఉన్న అధికారులకు సరికొత్త ఏఐ సాధనాలను వాడుకోవాలని సూచించాను. అదే సమయంలో ఆ సమాచారం, నివేదికలను ఒకటికి రెండుసార్లు ధ్రువీకరించుకోవాలి. ఏఐతో తయారు చేశామని స్పష్టంగా పేర్కొనాలి' అని సూచించినట్లు తెలిపారు.**

**'ప్రస్తుతం ఏఐకి సమయం వచ్చింది. దీన్ని అందుకోవాలి. భారతీయులు చురుకైన వారు, తెలివైన వారు. చాలామంది అనుకుంటున్నట్లు ఏఐ వల్ల ఉద్యోగాలు పోవు. ఇది ఉద్యోగాలను పెంచుతుంది. భారత్ ఎప్పుడూ కొత్త సాంకేతికతలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటుంది. ఏఐ లాంటివి వచ్చినప్పుడు ఉద్యోగాలు పోతాయని కొందరు విమర్శిస్తూ ఉంటారు. ఆ భయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఏఐ తనకు ఇచ్చిన పాత్రను పోషిస్తుంది. అనైతిక వినియోగం వల్ల వచ్చే**



**సమస్యలను పరిష్కరించేందుకు మానవ జోక్యం అవసరం' అని స్పష్టం చేశారు. దేశంలో యువత ఈ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంలో కీలకపాత్ర వహిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.**




# యాక్సిస్ మాక్స్ లైఫ్, పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ భాగస్వామ్యం

**యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (గతంలో మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ), ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. టైర్ 1 నగరాలను దాటి గ్రామీణ భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న ప్రాంతీయ మార్కెట్లలో అందుబాటు ఖర్చుతో జీవిత బీమా పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం.**

ఈ భాగస్వామ్యం ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ 650 బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ల బలమైన నెట్‌వర్క్‌ను, పోస్టాఫీసుల ద్వారా 1.64 లక్షలకు పైగా యాక్సెస్ పాయింట్లను ఉపయోగించుకుని, టైర్ 3, టైర్ 4 , గ్రామీణ మార్కెట్లలోని కస్టమర్లకు అవసరాల ఆధారిత జీవిత బీమా పరిష్కారాల సమగ్ర సూట్‌ను అందిస్తుంది. ఇది ప్రభుత్వ ఆర్థిక చేరిక లక్ష్యాలకు, '2047 నాటికి అందరికీ బీమా' సాధించాలనే ఐఆర్‌డీఏఐ దార్శనికతకు మద్దతు ఇస్తుంది.

జీవిత బీమాను మరింత అందుబాటులోకి, సౌకర్యవంతంగా మారుస్తూ, యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ దాని ప్రధాన స్మార్ట్ వెల్త్ అడ్వాంటేజ్ గ్యారెంటీ ప్లాన్, స్మార్ట్ వైబ్ ప్లాన్, వివిధ టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లతో సహా వివిధ రకాల ఉత్పత్తులను అందిస్తుంది. యువ కస్టమర్ల కోసం తక్షణ ఆదాయం, పూర్తి జీవిత ఆదాయ ఎంపికల నుండి అవసరమైన రక్షణ, సమకాలీన పొదుపు లింక్డ్ సొల్యూషన్‌ల వరకు విభిన్న ఆర్థిక అవసరాలను తీర్చడానికి వీటిని రూపొందించింది.

# పేదలకు ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్ సేవలు

**హైదరాబాద్: ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ స్వచ్ఛంద సంస్థ అయిన ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సహకారంతో, ఇటీవల ఆదిలాబాద్ (తెలంగాణ), బెంగళూరు, ముంబైలలోని పేద వర్గాలకు సాధికారత కల్పించే కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, రుతుక్రమ పరిశుభ్రత విద్య, ఆర్థిక అక్షరాస్యత శిక్షణపై దృష్టి సారించిన ఈ ప్రాజెక్ట్ ఈ సంవత్సరం ప్రారంభంలో మొదలైంది.**

ఫ్లిప్‌కార్ట్ ఫౌండేషన్ సేవా కార్యక్రమం ద్వారా 9,700 మందికి పైగా ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరింది. మరో 26,000 మందికి పైగా సాకుకూల ప్రభావం కలిగింది. ఈ కార్యక్రమంలో వైద్య సంప్రదింపులు, వ్యాధులపై అవగాహన సెషన్లు, రోగ నిర్ధారణ పరీక్షలు, ఉచిత మందులు అందించే సమగ్ర ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. కౌమారదశలో ఉన్న బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రక్తహీనత పరీక్షలు, రుతుక్రమ పరిశుభ్రత వర్క్‌షాప్‌లు, శానిటరీ ఉత్పత్తుల పంపిణీ వంటివి చేపట్టారు. అలాగే టీనేజర్లకు ఆర్థిక అక్షరాస్యత తరగతులు నిర్వహించారు.
"ప్రజలు సమగ్ర జ్ఞానం, అవసరమైన వనరులతో సాధికారత పొందినప్పుడు స్థిరమైన మార్పు పుడుతుందని మేము గట్టిగా విశ్వసిస్తున్నాం" అని ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ వ్యవహారాల వైస్ ప్రెసిడెంట్ సారా గిడియన్ అన్నారు. "సమగ్ర అభివృద్ధి అనేది పేద వర్గాలు పురోగతి చెందినప్పుడే సాధ్యమవుతుంది" అని స్మైల్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సంతను మిశ్రా అభిప్రాయపడ్డారు.

# హౌస్‌లోకి 'రాను బొంబాయికి రాను' రాము, ప్రభాస్ హీరోయిన్..లిస్ట్ ఇదే!




బుల్లితెరపై బిగ్‌బాస్ రియాల్టీ షోకి ఉన్న క్రేజీ గురించి అందరికి తెలిసిందే. హిందీతో పాటు అన్ని భాషల్లోనూ ఈ షోకి మంచి ఆదరణ ఉంది. ఇక తెలుగులో అయితే బిగ్‌బాస్ షో కోసం ఎదురు చూసే బుల్లితెర ప్రేక్షకులు చాలా మందే ఉన్నారు. ఇప్పటి వరకు ఎనిమిది సీజన్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. త్వరలోనే సీజన్ 9 ప్రారంభం కానుంది. ఈ సారి ఈ గేమ్ షోని సరికొత్త ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రతి సీజన్‌కి కంటెస్టెంట్లను డైరెక్ట్‌గా హౌస్‌లోకి పంపేవారు. ఈ సారి మాత్రం షో ప్రారంభానికి ముందే కొంతమందికి 'అగ్ని పరీక్ష' పెట్టారు. ఇందులో పాల్గొని గెలిచిన ఐదు లేదా ఆరుగురిని హౌస్‌లోకి పంపుతారు. వీరితో పాటు మరికొంతమంది డైరెక్ట్‌గా బిగ్‌బాస్ ఇంట్లోకి వెళ్లబోతున్నారు.

**సరికొత్తగా**

బిగ్‌బాస్ సీజన్ 9ని కొత్తగా ప్లాన్ చేస్తున్నారు నిర్వాహకులు. ఇప్పటి వరకు బిగ్‌బాస్ కంటెస్టెంట్స్ అంతా ఒకే హౌస్‌లో ఉండేవాళ్లు. కానీ సీజన్ 9లో మాత్రం కంటెస్టెంట్స్ రెండు గ్రూపులుగా విడిపోయి..వేరు వేరు హౌస్‌లో ఉండబోతున్నారు. ఈ సీజన్‌లో 15 మంది కంటే ఎక్కువే హౌస్‌లోకి వెళ్లబోతున్నారు. వారిలో సగం ఒక హౌస్‌లో ఉంటే..మరో సగం మంది వేరే హౌస్‌లో ఉంటారు. ఆట తీరుని బట్టి కంటెస్టెంట్ ఏ ఇంట్లో ఉండాలో డిసైడ్ చేస్తారట. వీరికి పెట్టే టాస్క్‌లు కూడా కొత్తగా ఉండబోతున్నాయట. ఈ సారి మైండ్ గేమ్‌తో పాటు ఫిజికల్ టాస్క్‌లు కూడా కాస్త కఠినంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

**కంటెస్టెంట్స్ వీరే?**

ఎప్పటి మాదిరే ఈ సారి కూడా బిగ్‌బాస్ షో ప్రారంభానికి ముందే కంటెస్టెంట్ల లిస్ట్ బయటకు వచ్చింది. సీజన్ 9లో పాల్గొనేది వీళ్లే అంటూ సోషల్ మీడియాలో ఓ లిస్ట్ చక్కర్లు కొడుతోంది. వారిలో 'రాను బొంబాయికి రాను' సాంగ్ సింగర్, డ్యాన్సర్ రాము రాథోడ్, ప్రభాస్ 'బుజ్జిగాడు' సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించిన సంజన గల్రానీ, కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ, సీనియర్ హీరోయిన్ ఆశా షైనీ, జబర్దస్త్ కమెడియన్ ఇమ్మాన్యుయేల్, అలేఖ్య చిట్టి పికిల్స్ నుంచి రమ్య మోక్ష, యంగ్ హీరో హర్షిత్ రెడ్డి, కమెడియన్ సుమన్ శెట్టి, కన్నడ నటి తనూజ పుట్టస్వామి, సీరియల్ నటుడు భరణి, ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కామనర్స్‌గా శ్రీజ, పవన్ కల్యాణ్, నాగ ప్రశాంత్, మాస్క్ మ్యాన్ హరీశ్ వెళ్లే అవకాశం ఉంది. మరి వీరిలో నిజంగానే ఎంతమంది బిగ్‌బాస్ షోలోకి వెళ్తున్నారనే విషయం తెలియాలంటే సెప్టెంబర్ 7 వరకు ఆగాల్సిందే.

# భార్యాభర్తలు పొడుచుకుంటున్నారు.. ప్రేమలో ఇన్వెస్ట్ చేయొద్దు: నటుడు

ప్రేమలో ఇన్వెస్ట్ చేస్తే ఏమీ మిగలదు అంటున్నాడు బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ షోరే . చిన్నప్పటి నుంచి తనకు ప్రేమ కలిసిరావడం లేదని చెప్తున్నాడు. కానీ తాను బంబుల్ అనే ఓ డేటింగ్ యాప్‌లో ఉన్నట్లు తెలిపాడు. రణ్‌వీర్ ఇంకా మాట్లాడుతూ.. స్త్రీపురుషుల మధ్య దూరం పెరిగింది. మాజీ ప్రియుడితో కలిసి భర్తను చంపుతున్న భార్య.. కుటుంబసభ్యుల అండదండలతో భార్య ప్రాణాలు తీసిన భర్త.. ఇలాంటి వార్తలే తరచూ కనిపిస్తున్నాయి.



**ప్రేమలో ఇన్వెస్ట్?**

నాకైతే చిన్నప్పటినుంచి ఈ ప్రేమలు కలిసిరావడం లేదు. ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్‌ను బట్టి ప్రేమలో పడేందుకు ఇది సరైన సమయం కాదేమో అనిపిస్తోంది. మార్కెట్ పడిపోతున్నప్పుడు ఇన్వెస్టర్లు డబ్బు పెట్టరు. ప్రేమ విషయంలోనూ అంతే.. ఇప్పుడు మార్కెట్ బాగోలేదు. కాబట్టి లవ్‌లో ఇన్వెస్ట్ చేయడం కరెక్ట్ కాదు. రోజులెలా ఉన్నాయంటే.. నా మాజీ ప్రియుడు కూడా నా కుటుంబ సభ్యుడే అని భార్య ఎదురుతిరిగి చెప్తోంది.

**మార్కెట్ బాగోలేదు**

ఆమె అన్నదాంట్లో తప్పేముందని పదిమంది తనకు వత్తాసు పలుకుతున్నారు. దీన్నే డౌన్ మార్కెట్ అంటున్నాను. ఇలాంటి సమయంలో ప్రేమ జోలికి పోకుండా.. బుద్ధిగా ఇంట్లో ఉండి బాడీ బిల్డింగ్‌పై ఫోకస్ చేస్తే మీకే మంచిది అని సలహా ఇచ్చాడు. కాగా రణ్‌వీర్ షోరే.. గతంలో పూజా భట్‌ను ప్రేమించాడు. కొంతకాలం పాటు డేటింగ్‌లో ఉన్న వీరిద్దరూ తర్వాత బ్రేకప్ చెప్పుకున్నారు. **పెళ్లి** 2010లో నటి కొంకణసేన్ శర్మను పెళ్లాడాడు. వీరికి కుమారుడు హరూన్ సంతానం. భార్యాభర్తల మధ్య పొరపచ్చాలు రావడంతో 2015లో విడిపోయారు. 2020లో విడాకులు తీసుకున్నారు. రణ్‌వీర్ చివరగా బిండియాకే బాహుబలి అనే సిరీస్‌లో కనిపించాడు. హిందీ బిగ్‌బాస్ ఓటీటీ మూడో సీజన్‌లోనూ పాల్గొన్నాడు.

# గుడ్ న్యూస్ చెప్పిన ఇలియానా.. ఇంకా సమయం ఉంది!

ఇలియానా..ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్. ఎన్టీఆర్, ప్రభాస్, మహేశ్ బాబు..ఇలా స్టార్ హీరోలందరితోనూ ఆమె నటించింది. ఆ తర్వాత బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అక్కడ కొన్ని సినిమాలు చేసినా అంతగా గుర్తింపు రాలేదు. పెళ్లి తర్వాత కూడా ఒకటి రెండు సినిమాల్లో నటించింది. అయితే పిల్లలు పుట్టడంతో గత కొంతకాలంగా ఆమె సినిమాలకు దూరంగా ఉంటుంది. ఇలియానా రీఎంట్రీ ఇస్తే బాగుండని చాలా మంది ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇలాంటి సమయంలో తన అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది ఇలియానా. త్వరలోనే మళ్లీ వెండితెరపై ఎంట్రీ ఇస్తానని చెప్పింది.

తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'ప్రస్తుతం తల్లిగా పూర్తి సమయాన్ని నా ఇద్దరి పిల్లలకే కేటాయిస్తున్నాను. ఇప్పడే సినిమాల్లో నటించాలనే ఆసక్తి లేదు. అభిమానులు నన్ను ఎంత మిస్ అవుతున్నారో అర్థం చేసుకోగలను. నటన అంటే నాకు కూడా ఇష్టమే. కానీ దానికంటే ముందు నా పిల్లల బాగోగులు చూసుకేనే బాధ్యత నాకుంది. అందుకే కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్నాను. త్వరలోనే మళ్లీ మీ ముందుకు వస్తాను. అయితే అది ఎప్పడు, ఏ సినిమా అనే విషయం మాత్రం ఇప్పడే చెప్పలేను. రీఎంట్రీ ఇచ్చే ముందు నేను మానసికంగానే కాకుండా శారీరకంగానూ కొన్ని మార్పులు చేసుకోవాలి. దానికి కొంత సమయం పడుతుంది' అని ఇలియానా చెప్పుకొచ్చింది. త్వరలోనే ఇలియానా వెండితెరపై మెరవనుందని తెలియడంతో ఆమె ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

కాగా, 2006లో దేవదాస్ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది ఇలియానా. చివరిగా 2018లో రవితేజతో 'అమర్ అక్బర్ ఆంటోనీ' సినిమా చేసింది. 2023లో మైఖేల్ డోలన్ అనే విదేశీయుడిని పెళ్లి చేసుకొని..అదే ఏడాది చివరిలో ఓ కొడుక్కి జన్మనిచ్చింది. ఈ ఏడాది జులైలో రెండో కొడుకు పుట్టినట్లు ఇలియానా ప్రకటించింది.





# మూడంకెల మార్క్ దాటేసిన 'కొత్త లోక'

హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ అనగానే చాలామంది ప్రేక్షకులకు చిన్నచూపు. హా ఏముందిలే అని అనుకుంటారు. కానీ అప్పట్లోనే విజయశాంతి లాంటి హీరోయిన్స్.. 'కర్తవ్యం' లాంటి సినిమాలు చేశారు. బాగానే గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ తర్వాత కాలంలో హీరోలు, కమర్షియల్ చిత్రాల హవా పెరిగేసరికి ఫిమేల్ సెంట్రిక్ మూవీస్ రావడం బాగా తగ్గిపోయింది. కానీ గత దశాబ్ద కాలంలో మాత్రం దక్షిణాదిలో అడపాదడపా వస్తూనే ఉన్నాయి.

గత కొన్నేళ్లలో హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ అనగానే అనుష్క గుర్తొస్తుంది. 'అరుంధతి'తో ట్రెండ్ సెట్ చేసిన ఈ బ్యూటీ.. తర్వాత రుద్రమదేవి, భాగమతి తదతరత చిత్రాలతో తన సకెస్‌ని కొనసాగించింది. తర్వాత కాలంలో పలువురు సౌత్ హీరోయిన్లు.. ఫిమేల్ సెంట్రిక్ మూవీస్ తీసినప్పటికీ అనుష్క దరిదాపుల్లోకి చేరుకోలేకపోయారు. కానీ 'మహానటి' మూవీతో కీర్తి సురేశ్ ఆ ఫీట్ సాధించింది. ఈ మూవీకి ఏకంగా రూ.84 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చాయి.

2018లో 'మహానటి' రాగా ఆ రికార్డ్ అలానే ఉంటూ వచ్చింది. కానీ ఇప్పడు 'కొత్త లోక' సినిమా సరికొత్త రికార్డ్స్ సృష్టిస్తోంది. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం.. రిలీజైన 7 రోజుల్లోనే రూ.100 కోట్ల కలెక్షన్ మార్క్ అందుకుంది. సాధారణంగా చూస్తే ఇదేమంత ఎక్కువ మొత్తంలా అనిపించకపోవచ్చు. కానీ మిడ్ రేంజ్ హీరోయిన్ అయిన కల్యాణి ప్రియదర్శన్‌ని లీడ్ రోల్‌లో పెట్టి తీసిన సూపర్ హీరో సినిమాకు ఈ రేంజ్ వసూళ్లు అంటే కచ్చితంగా విశేషమే.

ఇప్పటికే లాభాల్లోకి వెళ్లిపోయిన 'కొత్త లోక'.. ఇప్పడు రూ.100 కోట్ల మార్క్ కూడా దాటేసినట్లు తెలుస్తోంది. తద్వారా మహానటి, రుద్రమదేవి, భాగమతి, అరుంధతి చిత్రాల కంటే ఎక్కువ వసూళ్లు సాధించిన సౌత్ ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీగా నిలిచింది. థియేట్రికల్ రన్ పూర్తయ్యేసరికి ఇది ఇంకెన్ని కోట్లు కలెక్ట్ చేస్తుందో చూడాలి?



# మంగ్లీ అంటే ఫోక్ సాంగ్సే కాదు.. ఇప్పడు ఇలా

మంగ్లీ పేరు చెప్పగానే తెలంగాణ ఫోక్ సాంగ్ ఎక్కువగా గుర్తొస్తుంటాయి. పల్లె గీతాలతో పాపులారిటీ తెచ్చుకున్న ఈమె.. గత కొన్నేళ్ల నుంచి తెలుగు సినిమాల్లోనూ అడపాదడపా కమర్షియల్ పాటలు పాడుతూనే ఉంది. అయితే మంగ్లీ అంటే ఒకేలాంటి పాటలు పాడుతుంది అనే అభిప్రాయం చాలామందికి ఉంది. అలాంటిది ఇప్పడు ఓ డిఫరెంట్ సాంగ్‌తో వచ్చేసింది. వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని స్తూతిస్తూ ఈ పాట పాడింది.

కర్ణాటిక్ మ్యూజిక్ కూడా గతంలోనే నేర్చుకున్న మంగ్లీ.. ఇప్పడు వినాయకుడి గీతాన్ని ఆ జానర్‌లోనే పాడింది. 'శ్రీ గణపతిని' అంటూ సాగే ఈ గీతం రెండు రోజుల క్రితం తన యూట్యూబ్ ఛానెల్‌లో రిలీజ్ చేసింది. రెస్పాన్స్ కూడా బాగానే వస్తోంది. మీరు కూడా ఓ లుక్కేసేయండి.



# 'హారర్ జోనర్ అంటే ఇష్టం.. ఏ డైరెక్టర్ ఇంతలా టార్చర్ చేయలేదు'

ఇటీవలే పరదా మూవీతో అలరించిన అనుపమ పరమేశ్వరన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆమె హీరోయిన్‌గా నటించిన హారర్ మూవీ కిష్కింధపురి. ఈ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది.

రిలీజ్ తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ఈనేపథ్యంలోనే కిష్కింధపురి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు అనుపమ పరమేశ్వరన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హారర్ ఫిల్మ్స్ అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. నా జుట్టును చూసే ఇలాంటి సినిమాలు వచ్చాయని అనుపమ నవ్వుతూ మాట్లాడింది.

అనుపమ మాట్లాడుతూ..'నాకు హారర్ జోనర్ సినిమాలంటే ఇష్టం. నా మూడేళ్ల వయసు నుంచే హారర్ మూవీస్ చూశా. నా జుట్టు చూసే ఈ అవకాశాలు వచ్చాయి అనుకుంటా. కౌశిక్ నాకు కథ చెప్పగానే చాలా నచ్చింది. అతను చెప్పిన ఫ్లో నాకు నచ్చింది. కౌశిక్‌తో పని చేయడం అద్భుతంగా అనిపించింది. స్క్రిప్ట్‌పై ఫుల్ క్లారిటీ ఉన్న వ్యక్తి. డబ్బింగ్ స్టూడియోలో ఇంతలా నన్ను టార్చర్ చేసిన తెలుగు డైరెక్టర్ మరెవరూ లేరంటూ' నవ్వుతూ చెప్పారు. కాగా.. ఈ సినిమాకు కౌశిక్ పెగళ్ల దర్శకత్వం వహించారు. ఈ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్లలో రిలీజ్ కానుంది.

# ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిన జింబాబ్వే ప్లేయర్

**సీన్ విలియమ్స్**
**జింబాబ్వే వెటరన్ క్రికెటర్ సీన్ విలియమ్స్ సరికొత్త అధ్యాయం లిఖించాడు. అంతర్జాతీయ టీ20లలో సుదీర్ఘకాలం కొనసాగిన ఆటగాడిగా అవతరించాడు. తద్వారా ఇన్నాళ్లు.. బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డు బద్దలు కొట్టాడు.**




శ్రీలంకతో తాజా టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ సందర్భంగా సీన్ విలియమ్స్ ఈ ఘనత సాధించాడు. కాగా రెండు వన్డేలు, మూడు టీ20లు ఆడే నిమిత్తం శ్రీలంకక్రికెట్ జట్టు జింబాబ్వేలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా తొలుత వన్డే సిరీస్ జరుగగా.. 20తో జింబాబ్వే క్లీన్‌స్వీప్ అయింది.

**రిటైర్మెంట్ ప్రకటించి..**
ఈ క్రమంలో బుధవారం టీ20 సిరీస్ మొదలు కాగా.. సీన్ విలియమ్స్ పునరాగమనం చేశాడు. దాదాపు ఏడాది విరామం తర్వాత మళ్లీ జింబాబ్వే టీ20 జట్టులోకి తిరిగి వచ్చాడు. కాగా 38 ఏళ్ల సీన్ విలియమ్స్.. గతేడాది మే 12న బంగ్లాదేశ్‌తో మ్యాచ్ ముగిసిన తర్వాత అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు.అయితే, టీ20 ప్రపంచకప్2026 ఆఫ్రికన్ క్వాలిఫయర్స్ నేపథ్యంలో రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న విలియమ్స్.. సెప్టెంబరులో జరిగే ఈ మ్యాచ్‌లలో పాల్గొనున్నాడు. అయితే, అంతకంటే ముందు లంకతో సొంతగడ్డపై సిరీస్ సందర్భంగానే రీఎంట్రీ ఇచ్చేశాడు.

**ప్రపంచ రికార్డు**
హరారే వేదికగా శ్రీలంకతో తొలి టీ20 సందర్భంగా వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన సీన్ విలియమ్స్.. 11 బంతులు ఎదుర్కొని.. రెండు ఫోర్ల సాయంతో 14 పరుగులు మాత్రమే చేశాడు. అయితే, ఆట పరంగా రాణించకపోయినా.. సుదీర్ఘ అంతర్జాతీయ టీ20 క్రికెట్ ప్రయాణంలో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

**2006 నుంచి..**
కాగా 2006లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా సీన్ విలియమ్స్ జింబాబ్వే తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ ఇప్పటి వరకు తన 82 టీ20లు ఆడి 1705 పరుగులు సాధించాడు. అదే విధంగా.. 24 టెస్టుల్లో 1946, 164 వన్డేల్లో 5217 రన్స్ రాబట్టాడు.
కాగా తాజా రీఎంట్రీతో సీన్ విలియమ్స్ అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్లో 18 ఏళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్నాడు. ప్రపంచంలో సుదీర్ఘకాలం ఇలా ఇంటర్నేషనల్ టీ20లలో కొనసాగుతున్న ఏకైక క్రికెటర్‌గా నిలిచాడు. కాగా టీ20 ప్రపంచకప్2024 ముగిసిన తర్వాత బంగ్లా దిగ్గజం షకీబ్ అల్ హసన్ పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే.

**అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో సుదీర్ఘ కెరీర్ కలిగి ఉన్న క్రికెటర్లు**
**సీన్ విలియమ్స్ (జింబాబ్వే)- 2006- 2025* - 18 ఏళ్ల 279 రోజులు- 129 మ్యాచ్‌లు**
**షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్)- 2006- 2024- 17 ఏళ్ల 166 రోజులు- 82 మ్యాచ్‌లు**
**మహ్మదుల్లా (బంగ్లాదేశ్)- 2007- 2024- 17 ఏళ్ల 41 రోజులు- 141 మ్యాచ్‌లు**
**రకీప్ పటేల్ (కెన్యా)- 2008- 2025- 16 ఏళ్ల 357 రోజులు- 88 మ్యాచ్‌లు**
**రిచర్డ్ బెర్రింగ్‌టన్ (స్కాట్లాండ్)- 2008- 2005- 16 ఏళ్ల 343 రోజులు- 102 మ్యాచ్‌లు**



## యూఎస్ ఓపెన్ 2025... తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు యుకీ బాంబ్రీ

భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. డబుల్స్‌లో తన సహచరుడు మైకెల్ వెనుస్‌తో కలిసి యుకీ యూఎస్ ఓపెన్ బరిలోకి దిగాడు. వీరిద్దరికి 14వ సీడ్ దక్కింది. అయితే, ప్రీక్వార్టర్స్‌లో నాలుగో సీడ్ జోడీ కెవిన్ క్రావిట్జ్ టిమ్ పూయిట్జ్‌పై 64, 64 తేడాతో యుకీ జోడీ విజయం సాధించింది. దాదాపు గంటన్నరపాటు జరిగిన పోరులో పైచేయి సాధించారు. క్వార్టర్స్‌లో క్రొయేషియాకు చెందిన నికోలా మెక్టిక్ అమెరికా ప్లేయర్ రాజీవ్‌రామ్‌తో యుకీ మైకెల్ తలపడనున్నారు.

**ఇప్పటివరకు..**
33 ఏళ్ల యుకీ బాంబ్రీ ఇప్పటివరకు సింగిల్స్‌లో ఒక్కసారి కూడా గ్రాండ్‌స్లామ్‌ల్లో తొలి రౌండ్‌ను కూడా అధిగమించలేదు. కానీ, డబుల్స్‌లో కాస్త ఫర్వాలేదు. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో మూడో రౌండ్ వరకూ చేరాడు. ఇప్పుడు మొదటిసారిగా క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. నాలుగో సీడ్‌కే షాక్ ఇచ్చిన యుకీ జోడీ క్వార్టర్స్‌లో 11వ జోడీని ఎదుర్కోవడం పెద్ద కష్టమేం కాదు. మరో రెండు మ్యాచుల్లో విజయం సాధిస్తేనే ఫైనల్‌కు చేరుకొనే అవకాశం ఉంది.

**జూనియర్ యూఎస్ ఓపెన్‌లో..**
జూనియర్ యూఎస్ ఓపెన్‌లో భారత ప్లేయర్లకు చుక్కెదురైంది. ఈసారి ఆరుగురు బరిలోకి దిగగా.. అందరూ తమ పోరాటాన్ని ముగించారు. అయితే, భారీ అంచనాలు ఉన్న మాయా రాజేశ్వరన్ రేవతి చివరివరకూ పోరాడినా సెకండ్ సీడ్ హన్నా చేతిలో ఓటమి తప్పలేదు. దాదాపు 2 గంటల 2 నిమిషాల పాటు మ్యాచ్ జరిగింది. చివరికి హన్నా 76 (1), 46, 63 తేడాతో మాయాపై గెలిచింది. ఇక బాయ్స్ డబుల్స్‌లో హితేశ్ క్రిష్ త్యాగి కూడా రెండో రౌండ్‌లోనే వెనుదిరిగారు.



## దబంగ్ ఢిల్లీ శుభారంభం

**బెంగళూరు బుల్స్‌కు రెండో పరాజయం**
మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పోరులో ఢిల్లీ 41-34తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. కెప్టెన్ అశు మలిక్ (15 పాయింట్లు) ముందుండి జట్టును గెలిపించాడు. రెయిడింగ్‌లో అదరగొట్టాడు. 23 సార్లు కూతకెళ్లిన కెప్టెన్ 12 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. మరో రెయిడర్ నీరజ్ నర్వాల్ (7) ఆకట్టుకున్నాడు. వీరిద్దరి శ్రమకు ఊతమిచ్చేలా... డిఫెండర్లు సౌరభ్ నందల్ (3), ఫజల్ అత్రాచలి (3), సుర్జీత్ సింగ్ (3) సమష్టిగా రాణించారు.
ప్రత్యర్థి రెయిడర్లను అద్భుతంగా టాకిల్ చేశారు. బెంగళూరు జట్టులో ఆల్‌రౌండర్ అలీరెజా మిర్జాయిన్ (10), రెయిడర్ ఆశిష్ మలిక్ (8) మెరుగ్గా ఆడారు. అయితే సహచరుల నుంచి సరైన సహకారం లేక బెంగళూరు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడింది. విశాఖ అంచెలో బెంగళూరు బుల్స్ ఇంకా బోణీ కొట్టలేకపోయింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్ జైపూర్ పింక్‌పాంథర్స్ 39-36తో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. జైపూర్ రెయిడర్లు నితిన్ కుమార్ (13), అలీ చౌబ్తరష్ (8) క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చారు.
పట్నా జట్టులో రెయిడర్లు మణిందర్ సింగ్ (15), సుధాకర్ (9), అయాన్ (6) అద్భుతంగా రాణించినప్పటికీ డిఫెండర్ల వైఫల్యంతో పరాజయం తప్పలేదు. పైరేట్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో బెంగాల్ వారియర్స్; హరియాణా స్టీలర్స్‌తో యు ముంబా తలపడతాయి. 12 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ప్రస్తుతం మూడు జట్లు పుణేరి పల్టన్, యూపీ యోధాస్, యు ముంబా జట్లు నాలుగు పాయింట్లతో 'టాప్'లో ఉన్నాయి.

## వరల్డ్‌కప్ టోర్నీకి సౌతాఫ్రికా జట్టు ప్రకటన.. మాజీ కెప్టెన్‌కు మొండిచేయి

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్2025 టోర్నమెంట్‌కు సౌతాఫ్రికా క్రికెట్ తమ జట్టును ప్రకటించింది. స్టైలిష్ ఓపెనర్ లారా వొల్వర్ట్ కెప్టెన్సీలో పదిహేను మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. ఈ జట్టులో పదిహేడేళ్ల వికెట్ కీపర్ బ్యాటర్ కరాబో మెసో‌కు కూడా చోటు దక్కడం విశేషం.

**ఆమెకు ఇదే తొలిసారి**
అండర్19 వరల్డ్‌కప్ టోర్నీల్లో రెండుసార్లు సౌతాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించిన మెసో.. సీనియర్ జట్టు తరఫున ప్రపంచకప్ టోర్నీలో పాల్గొనడం ఇదే తొలిసారి. ఇక బౌలింగ్ విభాగంలో స్పిన్ స్పెషలిస్టు నొన్‌కులులెకో ఎమ్‌లాబాతో పాటు సీమర్లు మసబట క్లాస్, తుమి సెఖుఖునె కూడా స్థానం సంపాదించారు.



**మాజీ కెప్టెన్‌కు మొండిచేయి**
మరోవైపు.. ఆల్‌రౌండర్ల కోటాలో నదినె డి క్లెర్క్, అన్నెకె బాష్, అనెరి డెర్క్‌సెన్, నొండుమిసో షంగేజ్ వరల్డ్‌కప్ ఆడనున్నారు. అయితే, ఇటీవలే తన రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న మాజీ కెప్టెన్ డేన్ వాన్ నికెర్క్ పేరును మాత్రం సౌతాఫ్రికా సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.

**భారత్- శ్రీలంక వేదికగా**
ఇక సీనియర్లు కొంతమంది మిస్సయినా.. హెడ్‌కోచ్ మండ్లా మషిమ్‌బీ మార్గదర్శనంలో పూర్తి స్థాయిలో సన్నద్ధమైన సౌతాఫ్రికా ఆత్మవిశ్వాసంతో వరల్డ్‌కప్ బరిలో దిగనుంది.

కాగా సెప్టెంబరు 30 నవంబరు 2 వరకు భారత్ శ్రీలంక వేదికగా ఐసీసీ మహిళల క్రికెట్ వరల్డ్‌కప్ టోర్నీ జరుగనుంది. ఇదిలా ఉంటే.. భారత మహిళా జట్టుతో పాటు సౌతాఫ్రికా వుమెన్ టీమ్ కూడా ఇంత వరకు ఒక్కసారి వరల్డ్‌కప్ ట్రోఫీ గెలవలేదు.

**ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్-2025 టోర్నమెంట్‌కు సౌతాఫ్రికా జట్టు**
**లారా వొల్వార్ట్ (కెప్టెన్), అయబొంగా ఖాక, క్లో ట్రియాన్, నదినె డి క్లర్క్, మరిజానే కాప్, తజ్‌మిన్ బ్రిట్స్, సినాలో జఫ్తా, నొన్‌కులులెకో ఎమ్‌లాబా, అన్నెకె బాష్, అనెరి డెర్క్‌సెన్, మసబట క్లాస్, సునె లూస్, కరాబో మెసో, తుమి సుఖుఖునె, నొండుమిసో షంగేజ్.**

**ఐసీసీ వన్డే వరల్డ్‌కప్-2025 టోర్నీకి భారత మహిళా క్రికెట్ జట్టు**
**హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియా, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, రాధ యాదవ్, రేణుక ఠాకూర్, శ్రీచరణి, స్నేహ్ రాణా.**
**స్టాండ్‌బై: సయాలీ సత్‌ఘరే, తేజల్ హసబ్నిస్, ప్రేమ రావత్, ప్రియా మిశ్రా, ఉమా ఛెత్రి, మిన్ను మణి.**

## ఆ రోజు మీడియా కంటే ముందు కోహ్లీతో మాట్లాడాల్సింది: రాబిన్ ఉతప్ప

విరాట్ కోహ్లీ నాయకత్వంలో టీమ్ఇండియా ఒకే ఒక్క వన్డే ప్రపంచకప్‌లో తలపడింది. సెమీస్‌కే పరిమితమైంది. కానీ, జట్టు ఎంపిక సమయంలోనే తీవ్రస్థాయిలో వివాదాస్పదం అయింది. తెలుగు ఆటగాడు అంబటి రాయుడిని ఎంపిక చేయకుండా విజయ్ శంకర్‌ను తీసుకోవడంతో విమర్శలు వచ్చాయి. అప్పుడు చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ మన తెలుగు మాజీ క్రికెటరే కావడం గమనార్హం. అప్పుడు జట్టు ఎంపికపై రాబిన్ ఉతప్ప విమర్శలు చేస్తూ విరాట్ కోహ్లీ కెప్టెన్సీ పైనా కామెంట్లు చేశాడు. అయితే, తాను అలా పబ్లిక్‌గా విమర్శించకముందే విరాట్‌తో మాట్లాడి ఉంటే బాగుండేదని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఉతప్ప వెల్లడించాడు. అప్పుడేమన్నాడు? ఇప్పుడు ఎందుకు సంజాయిషీ ఇచ్చుకున్నాడో చూద్దాం.



"నేను అప్పుడు జరిపిన సంభాషణ సారాంశం కేవలం విరాట్ కోహ్లీ గురించి కాదు. అక్కడ నా అభిప్రాయాలను మాత్రమే చెప్పా. నన్ను ఆ ఇంటర్వ్యూలో ఓ ప్రశ్న అడిగారు. ఆ సమయంలో విరాట్ భావం ఏంటో నాకు తెలియదు. కానీ, నేను ఏవి నిజమని నమ్మానో వాటిని తెలియజేశా. ఆ తర్వాత విరాట్‌తో నా అనుబంధం, స్నేహం తీవ్రంగా ప్రభావితమైంది. కానీ, దానినుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఆ ఇంటర్వ్యూలో మాట్లాడక ముందు కోహ్లీతో సంభాషించి ఉంటే బాగుండేది. నేను ఏది నమ్మానో అదే అతడితో చెప్పాల్సింది. నేనెప్పుడూ విరాట్‌తో నాకు ఎదురైన అనుభవాల గురించి మాట్లాడలేదు. అతడి నాయకత్వంలో నాకు దగ్గరైన వ్యక్తికి ఎదురైన పరిస్థితి గురించి మాత్రమే మాట్లాడా. నాయకత్వం గురించి కూడా కాదు. నాయకత్వ శైలి గురించే మాట్లాడా. ఒక్కొక్కరి స్టైల్ ఒక్కోలా ఉంటుంది. వారి అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. మనం గౌరవించాల్సిందే. జాతీయ మీడియాలో మాట్లాడే ముందు కోహ్లీతో చర్చించి ఉంటే మా రిలేషన్ బాగుండేదేమో. ఈ ఘటన నుంచి నేను నేర్చుకొన్న విషయమదే'' అని ఉతప్ప వ్యాఖ్యానించాడు.

**అప్పుడు ఏమన్నాడంటే?**
"విరాట్ కోహ్లీకి ఎవరైనా నచ్చకపోతే వారిని పక్కన పెట్టేస్తాడు. అందుకు అంబటి రాయుడు వ్యవహారమే ఉదాహరణ. ఒక్కసారి వద్దు అనుకుంటే ఇక అంతే. ప్రతిఒక్కరికీ ఒక్కోలా ప్రాధామ్యాలు ఉంటాయి. వాటిని నేను అంగీకరిస్తా. కానీ, అద్భుతంగా ఆడే ప్లేయర్‌కు తలుపులు మూసేస్తే ఎలా? అప్పటికే అతడు వరల్డ్ కప్ జెర్సీలు, కిట్ బ్యాట్ అంతా సిద్ధం చేసుకున్నాడు. అలాంటప్పుడు తాను ఇక వరల్డ్ కప్ కోసం వెళ్తాననే అనుకొంటాడు. కానీ, నువ్వు తీసుకోకుండా పక్కన పెట్టావు. ఇది సమంజసంగా లేదు. యువరాజ్ సింగ్ వ్యవహారంలోనూ ఇలాంటి తీరే. అప్పుడు యువీ క్యాన్సర్‌తో పోరాడి వచ్చాడు. రెండు వరల్డ్ కప్‌లను గెలిపించిన క్రికెటర్. అలాంటి వ్యక్తికి కూడా ఫిట్‌నెస్ టెస్టుల నుంచి మినహాయింపు ఇవ్వకపోతే ఎలా? నువ్వు కూడా అతడి కష్టాలను ప్రత్యక్షంగా చూశావు? సారథి అయ్యాక అదే స్థాయిని కొనసాగించలేదు. ఇవన్నీ నేను గమనించే మాట్లాడుతున్నా. యువీ విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు'' అని 2019 వరల్డ్ కప్ తర్వాత రాబిన్ ఉతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు.

## భారీ ఉపశమనం.. టీమ్ఇండియా ఆటగాళ్లకు బ్రాంకో టెస్టు లేనట్లే!

**భారత క్రికెటర్లకు అద్భుతమైన న్యూస్. అయితే, ఇది అధికారికంగా కాదు కానీ.. పలు నివేదికల ప్రకారం టీమ్ఇండియా ఆటగాళ్లకు బ్రాంకో టెస్టు నుంచి ఉపశమనం లభించినట్లు వార్తలు వస్తున్నాయి. మొన్నటివరకు యోయో టెస్టుతోపాటు బ్రాంకో టెస్టులోనూ పాస్ కావాల్సిందేనని పట్టుబట్టిన బీసీసీఐ ఇప్పుడు కాస్త వెనకడుగు వేసింది. రగ్బీ ఆటగాళ్ల కోసం అమల్లో ఉన్న ఇలాంటి విధానాన్ని మన క్రికెటర్లకు ఆపాదించడం సరైంది కాదనే విమర్శలూ వచ్చాయి. సీనియర్ ప్లేయర్ రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ఇలాంటి టెస్టును తీసుకొచ్చారంటూ కామెంట్లూ వినిపించాయి. దీంతో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుందని సమాచారం. ఎప్పట్లాగే ఫిట్‌నెస్ టెస్టులను నిర్వహించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.**




"ఆసియా కప్ కోసం భారత జట్టు నాలుగో తేదీ ఉదయం దుబాయ్‌కు బయల్దేరనుంది. ప్లేయర్లు అందరూ అక్కడే కలుసుకుంటారు. ఐసీసీ అకాడమీలో 5వ తేదీన తొలి ప్రాక్టీస్ సెషన్ జరగనుంది. ఒకవేళ అప్పటికీ మేనేజ్‌మెంట్, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్ బ్రాంకో టెస్టుతోనే ఫిట్‌నెస్ అంచనా వేయాలని భావిస్తే దుబాయ్‌లోనే నిర్వహించే అవకాశం లేకపోలేదు. అయితే, బ్రాంకో టెస్టుపై ఇప్పటికే వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో దాన్ని అమలు చేయకపోవచ్చు'' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

**మారిపోతూనే ఉంటాయి: సోహమ్ దేశాయ్**
ఆటగాళ్ల ఫిట్‌నెస్‌కు సంబంధించి అంచనా వేయడానికి కాలంతోపాటు విధానాలూ మారుతుంటాయని స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ మాజీ కోచ్ సోహమ్ దేశాయ్ వెల్లడించారు. ఈ టెస్టులేవీ జట్టు ఎంపికకు ప్రమాణం కాదని స్పష్టంచేశారు. "విరాట్ కోహ్లీ రవిశాస్త్రి సమయంలో శంకర్ బసు మార్గదర్శకంలో 2019 వరల్డ్ కప్ కోసం ఫిట్‌నెస్ లెవల్‌ను తీసుకొచ్చారు. అందరి ఆమోదంతోనే అమలు చేశారు. ప్రతి ఒక్క క్రికెటర్ ఇదే విధానంలో ఫిట్‌నెస్ నిరూపించుకొని వరల్డ్ కప్‌లో ఆడించారు. ఆ తర్వాత యోయో టెస్టు ఫిట్‌నెస్‌ను అంచనా వేయడానికి విరివిగా వినియోగిస్తున్నారు. ప్రతి సంవత్సరం మూడుసార్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఇది జట్టు సెలక్షన్‌కు ప్రామాణికం కాదు. ఇదంతా ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికే మాత్రమే'' అని సోహమ్ తెలిపారు.